నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 6-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 160 | పేజీలు: 4 | వెల: రూ.1/-

మాజీ ఎంపీ జంగారెడ్డి మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, ఫిబ్రవరి 5:మాజీ ఎంపీ జంగారెడ్డి మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హనుమకొండ మాజీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి శనివారం ఉదయం కన్నుమూశారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందారు. జంగారెడ్డి స్వస్థలం వరంగల్ జిల్లా పరకాల.

1935లో పరకాలలో జన్మించిన ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎమ్మెల్యేగా, ఎంపీగా సేవలు అందించారు. 1984లో ఎనిమిదో లోక్‌సభకు హనుమకొండ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో పీవీ నరసింహారావుపై విజయం సాధించారు.

అద్భుత ఘట్టం
రామానుజ సమతామూర్తి విగ్రహావిష్కరణ



హైదరాబాద్, ఫిబ్రవరి 5:ముచ్చింతల్‌లో సమతామూర్తి విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం సాయంత్రం 6:30 గంటలకు ఆవిష్కరించారు. సమతామూర్తి విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన అనంతరం మోదీ రామానుజాచార్యులకు నమస్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చిన్నజీయర్ స్వామి, మైం హోం గ్రూప్స్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సమతామూర్తి విగ్రహావిష్కరణకు కంటే ముందు 108 దివ్య దేశాల(వైష్ణవ ఆలయాలు)ను మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా మోదీకి చిన్నజీయర్ స్వామి దివ్య దేశాల విశిష్టతను వివరించారు. ఈ సాయంత్రం నిర్వహించిన విష్వక్సేనేష్టి యాగంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. యాగంలో పాల్గొన్న మోదీకి పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మోదీకి చిన్నజీయర్ స్వామి ఓ కంకణాన్ని బహుకరించారు. అనంతరం యాగశాల చుట్టూ మోదీ ప్రదక్షిణలు చేశారు. మోదీ బంగారు వర్ణం దుస్తులు ధరించి యాగానికి హాజరయ్యారు.

ముచ్చింతల్‌లో రూ. 1200 కోట్లతో సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని 45 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ కేంద్రంలో రామానుజుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భద్ర వేదికపై 216 అడుగుల రామానుజుల విగ్రహం నిర్మించారు. పద్మపీఠంపై ఉన్న రామానుజుల విగ్రహం ఎత్తు 108 అడుగులు.

భద్ర వేదికపైకి వెళ్లేందుకు 108 ఉజ్జీవ సోపానాలు ఏర్పాటు చేశారు. సమతామూర్తి విగ్రహం దిగువన మూడంతస్తుల నిర్మాణం చేపట్టారు. భద్ర వేదిక మొదటి అంతస్తులో రామానుజుల స్వర్ణ విగ్రహం నెలకొల్పారు. 120 ఏండ్లు రామానుజులచార్యులు జీవించారని అందుకు గుర్తుగా 120 కిలోల స్వర్ణ విగ్రహం ఏర్పాటు చేశారు.

108 అడుగుల వృత్తాకారంలో అష్టదళ పద్మాకృతిలో మ్యూజికల్ ఫౌంటేన్ నిర్మించారు.

మ్యూజికల్ ఫౌంటేన్ స్థూపం ఎత్తు 36 అడుగులు కాగా, ఈ స్థూపంపై 6 అడుగుల రామానుజుల విగ్రహం ఏర్పాటు చేశారు. సమతామూర్తి విగ్రహం చుట్టూ 108 ఆలయాలు నిర్మించారు. దివ్య దేశాల పేరుతో 108 వైష్ణవ ఆలయాలను ఏర్పాటు చేశారు. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రానికి ఇరువైపులా హంపీ రథాలను నెలకొల్పారు. 2 లక్షల మొక్కలతో సహస్రాబ్ది ప్రాంగణాన్ని అలంకరించారు. 2014లో సమతామూర్తి కేంద్రానికి శంకుస్థాపన చేసి, ఆరేండ్లలో పూర్తి చేశారు.

రెండు పరిశోధన కేంద్రాలకూ ప్రారంభోత్సవం చేసిన ప్రధానమంత్రి



హైదరాబాద్, ఫిబ్రవరి 5:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఈరోజు హైదరాబాద్ వరాన్‌చెరులోని అంర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (ఇంటర్నేషనల్ క్రాప్స్ రిసెర్చి ఇన్ స్టిట్యూట్ ఫర్ ద సెమి ఆరిడ్‌ట్రాపిక్స్ – ఇక్రిశాట్) 50 వ వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి గ్రహరక్షణకు సంబంధించి వాతావరణ మార్పుల పరిశోధనా కేంద్రాన్ని , ఇక్రిశాట్ రాపిడ్‌జనరేషన్ అడ్వాన్స్‌మెంట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ రెండు సదుపాయాలను ఆసియా, సబ్ –సహరాన్ ఆఫ్రికాలోని చిన్న రైతులకు అంకితం చేశారు. ప్రధానమంత్రి ప్రత్యేకంగా రూపొందించిన ఇక్రిశాట్ లోగోను, ఈ ఉత్సవాల సందర్భంగా తీసుకువచ్చిన స్మారక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. తెలంగాణా రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళ సై సౌందర్ రాజన్, కేంద్ర మంత్రులు శ్రీ నరేంద్రసింగ్ తోమర్, శ్రీ జి.కిషన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వసంత పంచమి పర్వదినాన్ని గుర్తుచేసుకుంటూ ఇక్రిశాట్ 50 వసంతాల ఉత్సవాల సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. ఇక్రిశాట్ కు దేశానికి రాగల 25 సంవత్సరాలు ఎంతో కీలకమైనవని అంటూ ప్రధానమంత్రి, నూతన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిసాధనకు కృషి చేయాలన్నారు. ఇండియాతో సహా ప్రపంచంలో చాలా భాగానికి వ్యవసాయ రంగంలో ఇక్రిశాట్ అందిస్తున్న చేయూతను ప్రధానమంత్రి ప్రశంసించారు. నీరు, నేల నిర్వహణ , పంట రకాల మెరుగుదల, పంటల వైవిధ్యం, పశుగణ సమ్మిళితత్వం వంటివాటి

విషయంలో ఇక్రిశాట్ పాత్రను ఆయన కొనియాడారు.రైతులను మార్కెట్ లతో అనుసంధానం చేసేందుకు అనుసరిస్తు నమగ్రవిధానాలను , పప్పుధాన్యాలనుప్రోత్సహించడాన్ని , ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో శనగ పంటను ప్రోత్సహించడంవంటివాటిని ఆయన కొనియాడారు. ''మీ పరిశోధనలు, సాంకేతికత వ్యవసాయం సులభతరం, సుస్థిరత సాధించడానికి ఉపకరించింద''ని శ్రీనరేంద్ర మోదీ అన్నారు.

వాతావరణ మార్పుల వల్ల తీవ్ర ప్రభావానికి లోనయ్యేవారు, తక్కువ నిధులు కలిగి,అభివృద్ధిలో వెనుకబడి వున్న ప్రజలని ప్రధానమంత్రి అన్నారు. అందువల్ల వాతావరణ మార్పులపై ప్రపంచం ప్రత్యేక దృష్టిపెట్టాలని ఇండియా కోరుతున్నదని ప్రధానమంత్రి చెప్పారు. లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్ మెంట్ –ఎల్.ఐ.ఎఫ్.ఇ (లైఫ్) గురించి . పి–3 విశ్వ అనుకూల ప్రజా ఉద్యమాలు, 2070 నాటికి ఇండియా నెట్‌జీరో లక్ష్యాల గురించి ప్రదానమంత్రి ప్రస్తావించారు. '' ఈ విశ్వానికి అనుకూలమైన ప్రజా ఉద్యమం ప్రతి కమ్యూనిటీని, ప్రతి వ్యక్తిని వాతావరణ మార్పుల విషయంలో బాధ్యతతో వ్యవహరించేలా అనుసంధానం చేస్తుంది. ఇది కేవలం మాటలకే పరిమితం కాదు, ఇది భారత ప్రభుత్వ చర్యలలో ప్రతిఫలిస్తోంది ''అని ప్రధానమంత్రి అన్నారు.

దేశ15 ఆగ్రో క్లైమాటిక్ జోన్లు, ఆరు రుతువుల గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి భారతీయ వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రాచీన అనుభవాలను ప్రముఖంగా ప్రస్తావించారు. వాతావరణ మార్పులనుంచి రైతులను రక్షించేందుకు ఇండియా ప్రధాన దృష్టి మూలాలలో అనుసంధానమవుతూ, భవిష్యత్‌కు ముందడుగు వేయడమని ప్రధానమంత్రి అన్నారు. మా దృష్టి 80 శాతంపైగా ఉన్న రైతులపై ఉంది. వరు చిన్న చిన్న రైతులు. వారు ఎంతో విలువైన వారు అని ప్రధానమంత్రి అన్నారు.

మారుతున్న భారతదేశానికి సంబంధించి మరో కోణం గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, డిజిటల్ వ్యవసాయం భారతదేశ భవిష్యత్ అని అన్నారు. ప్రతిభకలిగిన భారతీయ యువత ఈ రంగంలో ఎంతో కృషి చేయగలదన్నారు. పంట అంచనా, భూరికార్డుల డిజిటైజేషన్, పురుగుమందులు, పోషకాలను డ్రోన్ల ద్వారా వెదజల్లడం వంటి వాటిలో సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ వాడకం పెరిగిందని ప్రధానమంత్రి అన్నారు . డిజిటల్ సాంకేతికత ద్వారా రైతులకు సాధికారత కల్పించేందుకు ఇండియా కృషి నానాటికి పెరుగుతున్నదని ప్రధానమంత్రి తెలిపారు.

అమృత్ కాల్‌లో ఇండియా వ్యవసాయంలో ఉన్నతస్థాయివృద్ధితో కూడిన సమ్మిళత వృద్ధిపై దృష్టి పెడుతున్నదని అన్నారు. స్వయం సహాయక బృందాల ద్వారా వ్యవసాయరంగంలో మహిళలకు మద్దతునివ్వడం జరుగుతోందన్నారు. జనాభాలోని ఎక్కువమందిని పేదరికం నుంచి బయటపడేసి వారికి మెరుగైన జీవనాన్ని కల్పించగల శక్తి వ్యవసాయ రంగానికి ఉందని ప్రధానమంత్రి అన్నారు. ఈ అమృత్ కాలం రైతులకు భౌగోళికంగా సంక్లిష్టంగా ఉన్న అంశాలలోనూతన అవకాశాలను కల్పించనున్నదన్నారు.

ఇండియా ద్వంద్వ వ్యూహంతో పనిచేస్తున్నదని అంటూ ప్రధానమంత్రి, ఒకవైపు పెద్ద మొత్తంలో భూమిని నీటి పొదుపుద్వారా ,నదుల అనుసంధానం ద్వారా సాగులోకి తెస్తున్నామని అన్నారు. తక్కువ నీటిపారుదల ఉన్నచోట సూక్ష్మ నీటిపారుదల ద్వారా నీటి వాడకంలో సమర్థతను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. మరోవైపు వంట నూనెల విషయంలో స్వావలంబనకు జాతీయ మిషన్ గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈమిషన్ పామాయిల్ విస్తీర్ణాన్ని 6 లక్షల హెక్టార్లకు పెంచేందుకు లక్ష్యంగా నిర్ణయించుకుందన్నారు. ఇది భారతీయ రైతులకు ప్రతి స్థాయిలో ప్రయోజనకరం కానున్నదని ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రైతులకు మేలు చేస్తుందని అన్నారు. పంట కోత అనంతర అవసరాలను బలోపేతం చేయడం అంటే, కోల్డ్ చెయిన్ స్టోరేజ్ సామర్థ్యాన్ని 35 మిలియన్ టన్నులకు చేర్చడం, లక్షకోట్ల రూపాయలతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రధానమంత్రి వివరించారు.

ఇండియా ఎఫ్.పి.ఒలు ఏర్పాటు చేయడం, వ్యవసాయ వాల్యూ చెయిన్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టిపెడుతున్నదని ప్రధానమంత్రి తెలిపారు. చిన్న రైతులను అప్రమత్తతో కూడిన శక్తిమంతమైన మార్కెట్ శక్తిగా తీర్చిదిద్దేందుకు వారిని వేలాది ఎఫ్.పి.ఒలుగా సంఘటితం చేస్తున్నామన్నారు.

ఇండియా లక్ష్యం కేవలం ఆహారధాన్యం ఉత్పత్తినిపెంచడం కాదని, ఇండియాకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా కార్యక్రమ నిర్వహణకు సరిపడినంత ఆహారధాన్యాలు ఉన్నాయని ప్రధానమంత్రి అన్నారు. మేం ఆహార భద్రతపై దృష్టిపెట్టడంతోపాటు పౌష్టికాహార భద్రతపై దృష్టిపెడుతున్నాం. ఈ దార్శనికతతో మేం గత 7 సంవత్సరాలలో బయో ఫోర్టిఫైడ్ రకాలను రూపొందించాం అని అన్నారు.

ఇక్రిశాట్ ఒక అంతర్జాతీయ సంస్థ. ఇది ఆసియా, సబ్ సహరాన్ ఆఫ్రికా అభివృద్ధికి వ్యవసాయ పరిశోధనలు చేస్తుంది. ఇది మెరుగైన పంట రకాలు, హైబ్రిడ్ వంగడాల వంటి వాటిని రైతులకు అందజేయడం ద్వారా వారికి తోడ్పడుతుంది. అలాగే చిన్న రైతులు, మెట్ట ప్రాంత రైతులు వాతావరణ మార్పులు తట్టుకునేందుకు తోడ్పాటు నందిస్తుంది.

బడుగుల కోసమే రాజ్యాంగం: వీహెచ్

సిద్దిపేట, ఫిబ్రవరి 5:: బడుగుల కోసం ఆలోచన చేసే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాశారని కాంగ్రెస్ నేతలు వి. హనుమంతరావు, దాసోజు శ్రావణ్ అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని కేసీఆర్ ఎందుకు మాట్లాడారో అర్థంకావడం లేదన్నారు. వ్యవసాయ చట్టాల అమలుకు సపోర్ట్ చేసి ఇప్పుడు మోదీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. దళిత సీఎం, మూడెకరాల భూమి అని చెప్పి దళితులను కేసీఆర్ మోసం చేశారని వీహెచ్, శ్రావణ్ ఆరోపించారు

మాజీ ఎంపీ జంగారెడ్డి పార్థివదేహానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5: మాజీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి పార్థివదేహానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి దయాకర్ రావు ఓదార్చారు. జంగారెడ్డితో దయాకర్ రావు తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. జంగారెడ్డి నిబద్ధత కలిగిన నాయకుడు. బీజేపీలో సుదీర్ఘంగా కొనసాగారు. దేశంలో బీజేపీ కేవలం రెండు సీట్లు మాత్రమే కలిగి ఉండగా, అందులో ఒకరు జంగారెడ్డి. ఆ సమయంలో హనుమకొండ నుండి ఆయన ఎంపీగా ఉన్నారు. ఒక పాత తరం ప్రజానాయకుడు, ప్రజల మనిషిని కోల్పోయాం. చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నాను అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు.

ముచ్చింతల్‌లో ప్రధాని – పట్టు వస్త్రాలు, తిరునామాలు ధరించి మోడీ ప్రత్యేక పూజలు

ముచ్చింతల్ , ఫిబ్రవరి 5: ముచ్చింతల్ ఆశ్రమాన్ని సందర్శించారు భారత ప్రధాని నరేంద్ర మోడీ. ఈ సందర్భంగా యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వక్సేనుడి ఆరాధనలో పాల్గొన్నారు మోడీ. తిరునామాలు , పట్టు వస్త్రాలు ధరించి యాగశాలకు విచ్చేశారు ప్రధాని. 7గంటలకు సమతామూర్తి విగ్రహాన్ని జాతికి అంకితం ఇవ్వనున్నారు. 15నిమిషాలు 3డీ షోని వీక్షించనున్నారు ప్రధాని. సమతామూర్తి సహస్రాబ్ది సమారోహాన్ని వైభవంగా నిర్వహించారు. యాగశాల, భద్రపీఠం,సభామంటపాన్ని సుగంధ భరిత పుష్పాలతో అలంకరించారు.

హైదరాబాద్ డ్రగ్స్ కేసుపై ఈడీకి సమాచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 5: డ్రగ్స్ కేసుపై ఈడీకి సమాచారం అందింది. మనీలాండరింగ్, హవాలా జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తుంది. టోనీతోపాటు కొంతమంది నైజీరియన్లు హవాలా చేసినట్లు ఈడీ గుర్తించింది. అలాగే వ్యాపారవేత్తల నుంచి తీసుకున్న నగదును వస్తువుల రూపంలో మార్చి విదేశాలకు తరలించినట్లు కూడా గుర్తించింది. వస్త్రాలు, విగ్గులు, ఆటవస్తువుల రూపంలో నైజీరియాకు ఎగుమతి చేశారు. గతనెల 24న సిటీ పోలీసులు ఈడీకి సమాచారం అందించారు. వ్యాపారవేత్తలను, టోనీని ప్రశ్నించాలని ఈడీకి పోలీసుల విజ్ఞప్తి చేశారు.

వసంత పంచమి, సరస్వతి పూజ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వసంత పంచమి, సరస్వతి పూజ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్ ద్వారా ఒక సందేశం ఇస్తూ,వసంత పంచమి, సరస్వతి పూజ సందర్భంగా దేశవాసులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మా శారదా ఆశీస్సులు అందరిపై ఉండాలని ,రుతురాజ్ వసంత్ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను, అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలన్నది జంగన్న కల: ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5:బీజేపీ సీనియర్ నేత చందుపట్ల జంగారెడ్డి మృతిపట్ల ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎన్.ఇంద్రసేనారెడ్డి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కాలేజీ విద్యనభ్యసించే రోజుల్లోనే జంగారెడ్డి ఎమ్మెల్యేగా ఉంటూ విద్యార్థి సమస్యలపై పోరాడేవారని గుర్తుచేశారు. తనను నిరంతరం రాజకీయాల్లో ప్రోత్సహించిన నాయకుడు జంగారెడ్డి అని అన్నారు. చిన్న రాష్ట్రాలకు అనుకూలంగా తీర్మానం చేయాలంటూ కొట్లాడిన నాయకుడు జంగారెడ్డి అని కొనియాడారు. ఎమర్జెన్సీ కాలంలో జైలుకు వెళ్లిన నాయకుడన్నారు. "తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలన్నది జంగన్న కల. అది చూడాలని నిరంతరం తపించేవారు" అని చెప్పుకొచ్చారు. జంగారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

భావితరాలకు ప్రేరణగా రామానుజాచార్యులు: మోదీ

హైదరాబాద్: రామానుజాచార్యులు భావితరాలకు ప్రేరణగా నిలిచారని ప్రధాని మోదీ అన్నారు. ముచ్చింతల్ ఆశ్రమంలో రామానుజ సమతామూర్తి విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. 216 అడుగుల సమతామూర్తి విగ్రహాన్ని జాతికి అంకితం చేశారు. సమతామూర్తి విగ్రహం చుట్టూ 108 ఆలయాలను నిర్మించారు. దివ్యదేశాల పేరుతో 108 వైష్ణవ ఆలయాలను నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ వసంత పంచమి రోజున రామానుజ విగ్రహావిష్కరణ సంతోషకరమన్నారు.

జంగారెడ్డి రాజకీయాల్లో మాకు స్ఫూర్తిప్రదాత: విద్యాసాగరరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 5: రాజకీయాల్లో తమకు స్ఫూర్తి ప్రదాత చందుపట్ల జంగారెడ్డి అని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసగరరావు అన్నారు. పార్టీని గ్రామాల్లో బలోపేతం చేయడానికి, ప్రజలకు సేవ చేసేందుకు కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈరోజు బీజేపీ ఈ స్థాయిలో ఉందంటే... అందులో ముఖ్యపాత్ర జంగారెడ్డి పోషించారన్నారు. జంగారెడ్డికి దేశవ్యాప్తంగా పేరు రావడానికి కారణం 1984లో బీజేపీ తరపున ఇద్దరు ఎంపీలు గెలిస్తే అందులో ఒకరు జంగారెడ్డి అని చెప్పుకొచ్చారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో జంగారెడ్డి పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణలో అందరూ ఆయనను 'కరెంట్ జంగన్న' అని ప్రేమగా పిలుచుకునే వారని సీహెచ్.విద్యాసాగరరావు తెలిపారు.

నిజామాబాద్‌లో గుట్టుగా వ్యభిచారం.. 11 మంది అరెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 5: నిజామాబాద్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టైంది. స్థానిక గాయత్రినగర్‌లో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో నిర్వాహకురాలితోపాటు ఇద్దరు విటులు ఉన్నారు. వ్యభిచార గృహంలో ఎనిమిది మంది మహిళలను కాపాడి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా గాయత్రి నగర్ కేంద్రంగా కొంతకాలంగా ఓ మహిళ ముందుండి వ్యభిచారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ పనుల కోసం నిజామాబాద్ వచ్చే యువతులు, మహిళలను పడుపు వృత్తిలోకి దింపుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రొంపిలోకి దిగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

నామినేషన్ వేసిన క్రీడా మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:ఉత్తరప్రదేశ్ క్రీడాశాఖ మంత్రి ఉపేంద్ర తివారీ నామినేషన్ ని దాఖలు చేసేందుకు పరుగులు పెట్టారు. సమయం దగ్గర పడడంతో ఆయన పరుగులు పెట్టారు బాలియాలో ఉన్న కలెక్టరేట్ ఆఫీస్ కు తొలుత నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్లారు.

ఆఫీసు గేటు వద్దకు వచ్చిన తర్వాత నామినేషన్ సమయం దగ్గర పడింది. కేవలం మూడు నిమిషాలు మిగిలి ఉండటంతో మంత్రి గేటు నుండి ఆఫీసు నామినేషన్ హాల్ లోకి పరుగులు పెట్టారు. డెడ్ లైన్ లోగా ఆఫీసుకు వెళ్లాలని మంత్రి రన్ చేశారు. బిజెపి టికెట్ పై ఆయన ఫేపెనా అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు.

యూపీలో 5 కోట్ల రూపాయల పట్టివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:యూపీలో మొదటి దశ ఎన్నికల వేళ పెద్ద మొత్తంలో డబ్బులు పట్టుకున్నారు పోలీసులు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పోలీసులు కాకాదేవ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు 5 కోట్ల రూపాయలను పట్టుకున్నారు. ఇదే సమయంలో స్వరూప్ నగర్ ప్రాంతంలో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించి, కోటి రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంత డబ్బు ఎవరిది, ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇక.. ఐటీ అధికారులు కూడా ఘటనా స్థలికి చేరుకొని, దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ 5 కోట్ల డబ్బు సీఎంఎస్ కంపెనీకి చెందిన వాహనంలో దొరికాయని పోలీసులు తెలిపారు. అయితే దీనిపై సీఎంఎస్ కంపెనీ బాధ్యులు ఈ విషయంపై స్పందిస్తూ.. కాన్పూర్‌కు చెందిన కెస్కో ఎలక్ట్రికల్ సంస్థకు చెందిన డబ్బు అని, వీటిని బ్యాంకుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అయితే వీరి దగ్గర వాటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు కూడా దొరకలేదని పోలీసులు పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం



(ఫిబ్రవరి 6 రాయబారి రామేశ్వరరావు జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210

డిజిటల్ ఇండియా, పియం గతిశక్తి' పథకాలతో ప్రగతిరథం పరుగులిడుతుందా..!

కరోనా మహమ్మారి దోబూచులాట తొలగనే లేదు. అలల భయాలు, వైరస్ వేరియంట్ల బహుముఖీన విధ్వంస రచనలకు తెరలు పడనే లేదు. చమురు ధరలు చుక్కల నుంచి దిగనే లేదు. ఉక్రేయిన్, పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు సమసి పోనే లేదు. ప్రపంచవ్యాప్తంగా కరోనా కారు మబ్బుల చీకట్లలో వెలుగులు విస్తరించనే లేదు. అయినా భారతదేశం భవ్యంగా వెలుగులు చిమ్మడానికి, ప్రగతి పథంలో పరుగులుడడానికి ఉత్సాహపడుతూనే ఉన్నది. విశ్వం కరోనాతో గజగజ వణుకుటున్న వేళ, ఇండియా వైరస్ వైరి పోరులో ధైర్యంగా నిలబడి కరోనాను కట్టడి చేస్తూ సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తూనే ప్రపంచ దేశాలకు మార్గదర్శిలా సగర్వంగా నిలబడి ఉంది. అన్ని ప్రతికూలతల నడుమ 9.2 శాతం అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధిని నమోదు చేసుకుంటూ, 630 బిలియన్ డాలర్ల విదేశీ నిల్వలు, అదుపులో ద్రవ్యోల్బనం, స్టాక్ మార్కెట్/కార్పొరేట్ల ఆశాజనక ఫలితాలు, 93 శాతం అర్హులకు తొలి టీకా డోసు, 70 శాతం రెండు డోసులు కరోనా టీకాలు అందించడం భారత్ సాధించిన ఓ అపూర్వ విజయమే.

పియం గతిశక్తి స్వరూపం:

ఎంత ప్రగతి సాధించినా అధిక జనాభా కలిగిన భారతాన్ని బహు బాధలు వెంటాడుతూనే ఉన్నాయి. నిరుద్యోగం, పేదరికం, అవిద్య లాంటి సామాజిక అంశాలు దేశ ప్రగతికి అడ్డుపడుతూనే ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ రేటు 7.2 శాతంగా అంచనా వేసినా వాస్తవం కడు ప్రమాదకర స్థాయిలోనే ఉందనేది నమ్మలేని నిజం అని నమ్మాలి. నిరుద్యోగ వైరస్‌ను తరిమి కొట్టడానికి 2022-23 కేంద్ర బడ్జెట్‌లో 35 శాతం పెరుగుదలతో ? 7.5 లక్షల కోట్లు కేటాయించడం హర్షదాయకం. దీనికి తోడుగా రాష్ట్రాలకు కాపిటల్ పెట్టుబడిగా(50-ఏండ్లకు వడ్డీలేని) ఒక లక్ష కోట్లను కేటాయించడం విశేషంగా పేర్కొనవచ్చు. ఆధునిక భారత నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయి చేయు కలిపి నడువవలసి ఉంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన 'పియం గతిశక్తి' పథకం మాధ్యమంగా మౌళిక వనరుల కల్పనలో భాగంగా రోడ్లు, రైల్వేలు, ఏయిర్ పోర్టులు, రాబోయే మూడేళ్లలో 100 మల్టీ-మోడల్ కార్గో టర్మినల్స్ వంటి వసతులను ఏర్పాటు చేస్తూ రవాణా వ్యవస్థను సరళతరం చేయనున్నారు. మల్టీ-మోడల్ కనెక్టివిటీ వేదికగా మారుమూల ప్రాంతాలకు కూడా రవాణా వసతులు కల్పిస్తూ ప్రయాణ సమయాన్ని తగ్గించనున్నారు. దేశవ్యాప్తంగా 400 వందేమాతరం రైళ్లు, 25,000 కిమీ నేషనల్ హైవే నెట్‌వర్క్‌లను ప్రవేశ పెట్టనున్నారు. వివిధ మంత్రిత్వశాఖల సమగ్రత (కాంప్రహెన్సివ్‌నెస్), ప్రాజెక్టుల ప్రాధాన్యతలు (ప్రియారిటైజేషన్), సర్వోత్తమీకరణం (ఆప్టిమైజేషన్), సమకాలీకరణ (సింక్రొనైజేషన్), విశ్లేషణాత్మకం (అనలిటికల్), క్రియాశీలత (డైనమిక్) అనబడే ఆరు 6 సూత్రాల ఆధారంగా పియం గతిశక్తిని శీఘ్రగతిన అమలు చేయనున్నారు.

డిజిటల్ ఇండియా 2.0 స్వరూపం:

కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత పొందిన అంశంగా రెండవ దశ డిజిటల్ ఇండియా ప్రస్తావించబడింది. సంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ, ఈ-పాస్‌పోర్టులు, డిజిటల్ యూనివర్సిటీ, డిజిటల్ బ్యాంకింగ్, డ్రోన్ ఇన్ ఫార్మ్ సెక్టార్, డాటా స్టోరేజ్ సెంటర్, గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్/మెబైల్ ఇంటర్నెట్, చవకైన మెబైల్ చార్జిజర్జిస్, టల్ స్థిరాస్తి భూ రికార్డుల వివరాలు, 5జి స్పెక్ట్రమ్ వేలం, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ లాంటి పథకాలు దేశ డిజిటల్ సామర్థ్యంతో పాటు ఉద్యోగ విస్తరణలో ఎంతో దోహదపడతాయని ఆశిస్తున్నారు. దేశ జనాభాలో 50 శాతం పట్టణ ప్రాంతాల్లో నివసిస్తుండంతో పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కూడా సముచితంగా ఉంది. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 1.5 లక్షల పోస్ట్ ఆఫీసులను కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలుగా మారనున్నాయి. 75-ఏండ్ల స్వాతంత్ర్య భారతంలోని 75 జిల్లాల్లో 75 డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్లు రానున్నాయి. స్టార్ట్‌అప్స్‌కు డ్రోన్ శక్తి ద్వారా టాక్స్ మినహాయింపులు పొడిగించడం కూడా జరిగింది. యంయస్‌యంఈ పోర్టల్స్ ద్వారా రుణ పెట్టుబడులను అందించనున్నారు. గ్రీన్ బాండ్లను విడుదల చేయడం, 5జీ సేవలను 2025 లోగా గ్రామాలకు అందుబాటులోకి తేవడానికి అంకురార్పణ జరిగింది. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఈ-ప్రయోగశాలల ఏర్పాటు దిశగా డిజిటల్ యూనివర్సిటీ నిర్మాణం, నేషనల్ డిజిటల్ హెల్త్ ఎకోసిస్టమ్‌లను ప్రతిపాదించడం హర్షదాయకం.

డిజిటల్ ఇండియా 2.0 ముందడుగుతో పాటు పియం గతిశక్తి పథకం ద్వారా సమగ్రాభివృద్ధి సాధ్యపడినప్పటికీ సామాజిక రంగాలైన విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన లాంటి అంశాలకు తగిన కేటాయింపులు జరగలేదనే విమర్శలు వినిపిస్తున్న వేళ భారతదేశ భాగ్యం వికసిస్తుందనే విశ్వాసంతో పౌరసమాజం ఆశావహ దృష్టితో ఎదురుచూస్తున్నది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సముద్రంలో గాయపడిన మత్స్యకారునికి వైద్య సహాయం అందించిన ఐఎన్ఎస్ ఆదిత్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:గోవాకు పశ్చిమాన 75 నాటికల్ మైళ్ల దూరంలో తీవ్రంగా గాయపడిన ఎఫ్ఓ హోనాథన్ అనే ఫిషింగ్ బోట్‌కు చెందిన మత్స్యకారుడు గాయపడి బాధలో ఉన్నట్టుగా సమాచారం అందుకున్న ఐఎన్ఎస్ ఆదిత్య ఆయనకు తక్షణ వైద్య సహాయం అందించింది. విపిన్ అనే మత్స్యకారుని కుడి చేతికి తీవ్రమైన గాయం తగిలింది, ఫలితంగా అధిక రక్తస్రావం మరియు రక్తం-ఆక్సిజన్ స్థాయిలు తగ్గాయి. సమాచారం అందుకున్న ఐఎన్ఎస్ ఆదిత్య వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మత్స్యకారున్ని పైకి తీసుకువచ్చి. ఫిషింగ్ బోట్‌లోనే ఆయనుకు ఆక్సిజన్ మరియు ప్రథమ చికిత్స అందించింది. విపిన్ కుడి చేతికి సంబంధించిన పలు వేళ్లపై గాయం కలిగింది. ఆయన వేళ్లు పగిలి బాధను ఎదుర్కొన్నాడు. రక్తస్రావం ఆపడానికి మరియు హేమోడైనమిక్ స్టెబిలైజేషన్ సాధించేలా చేసేందుకు ఆయనకు విమానంలో చికిత్స అందించారు. ఐఎన్ఎస్ ఆధిత్య పడవలోని సిబ్బందికి తగినంత వండిన ఆహారాన్ని అందించింది. గాయపడిన మత్స్యకారుడి పరిస్థితి నిలకడగా ఉంది. చికిత్స అనంతరం ఆయనను తన పడవలోని సహోద్యోగులతో చేర్చారు.

భారత సైన్యం కంటే చైనాపైనే రాహుల్‌కు నమ్మకం : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:చైనా, పాక్ విషయంలో పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ చేసిన వ్యాఖ్యలు ఇంకా రాజకీయ వేదికపై నానుతూనే వున్నాయి. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులతో సహా, కాంగ్రెస్ సీనియర్ నేత నట్వర్ సింగ్ రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టారు.

తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యూపీ ప్రచారంలో కూడా రాహుల్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. భారత సైనికుల పరాక్రమానికి రాహుల్ గాంధీ విలువ ఇవ్వరని, సైనికుల పరాక్రమాన్ని విశ్వసించరని తీవ్రంగా మండిపడ్డారు. చైనా మీడియానే నమ్ముతారని, చైనా మీడియాపైనే రాహుల్ ఎక్కువగా ఆధారపడతారని రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఆక్షేపించారు. భారత దేశం ఇప్పుడు అత్యంత బలవంతమైన దేశమని, ఈ విషయం ఇప్పటికే ప్రపంచానికి తెలిసిపోయిందన్నారు. సరిహద్దులను దాటిమరీ.. శత్రువుల పీచమణచిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గాల్వాన్ ఘర్షణలో భారత సైనికులే చాలా మంది వీర మరణం పొందారని, చైనా వాళ్లు తక్కువ మందే చనిపోయారని పేర్కొన్నారు.

రాహుల్ చైనా మీడియానే ఎక్కువగా నమ్ముతారు. 38 నుంచి 50 మంది చైనా సైనికులు గాల్వాన్ ఘర్షణలో చనిపోయారని ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది. భారత ఆర్మీ పరాక్రమంపై రాహుల్‌కు విశ్వాసం లేదు అని రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా మండిపడ్డారు.

యూపీలో శాంతిభద్రతల విషయంలో సీఎం యోగి సక్సెస్ అయ్యారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబునిచ్చారు. క్రిమినల్స్ రాష్ట్రం విడిచి పోయేలా చేశారని, వారి ఆస్తులను కూడా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. యూపీ అభివృద్ధి పథంలో సాగుతోందని, రోడ్ల పరిస్థితి కూడా చాలా మెరుగైందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

జియో కస్టమర్లకు షాక్.. నో ఇన్ కమింగ్, నో అవుట్ గోయింగ్..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:రిలయన్స్ జియో వాడుతున్న కస్టమర్లకు షాకింగ్ న్యూస్.. ఉన్నట్టుండి సిగ్నల్ రాకపోవడం, ఇన్ కమింగ్, అవుట్ గోయింగ్ కాల్స్ చేసుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇట్లాంటి నెట్‌వర్క్ ఇష్యూస్‌తో ముంబై వాసులు ఇవ్వాల (శనివారం) బాగా సతమతమయ్యారు. దీనిపై పెద్ద ఎత్తున జియో ఆఫీసులకు కంప్లెయింట్స్ వచ్చాయి. అంతేకాకుండా జియో నెట్‌వర్క్‌పై కొంతమంది అయితే తమ అక్కసు వెళ్లబోసుకుంటూ.. ఫన్నీగా ట్రోల్స్ చేశారు.

రిలయన్స్ జియో వినియోగదారులు ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఫిర్యాదుల ప్రకారం.. ఇంటర్నెట్ సేవలకు కూడా అంతరాయం ఏర్పడినట్టు తెలుస్తోంది. జియో కస్టమర్స్ కాల్ చేయడానికి ప్రయత్నించినప్పుడల్లా "ఔనీబి తీవణతిబబివతీవట నీని నివబిలినీతీని" అని మెసేజ్ వస్తున్నట్టు చాలా మంది నుంచి కంప్లెయింట్స్ వచ్చాయి.

నెట్‌వర్క్ సమస్యపై ట్విట్టర్లో ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుకు రిలయన్స్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ (జియో కేర్) స్పందిస్తూ.. "హాయ్! మీరు ఇంటర్నెట్ సేవలను ఉపయోగించడం లేదా.. మీ మొబైల్ కనెక్షన్‌లో కాల్స్ స్వీకరించడం, కాల్స్ చేయడం వంటి సమస్యను ఎదుర్కోవచ్చు. ఇది తాత్కాలికంగా జరిగే సమస్య. మా టీమ్ దీన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తోంది".. అంటూ కస్టమర్లకు రిప్లై ఇచ్చింది జియో కేర్.

2022 గణతంత్ర వేడుకల ఉత్తమ శకటంగా ఉత్తరప్రదేశ్ శకటం ఎంపిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:2022 గణతంత్ర దినోత్సవ పరేడ్ ఉత్తమ శకటాలు, ఉత్తమ కవాతు ఫలితాలు వెలువడ్డాయి. కవాతులో పాల్గొన్న త్రివిధ సేవలు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ /ఇతర సహాయక బలగాలు మరియు వివిధ విభాగాల నుంచి ఉత్తమ కవాతు బృందం , వివిధ రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన శకటాల్లో ఆకట్టుకున్న శకటాన్ని ఎంపిక చేసేందుకు ఏర్పాటైన మూడు న్యాయ నిర్ణేత బృందాలు విజేతలను ప్రకటించాయి.

మూడు సర్వీసుల్లో ఇండియన్ నేవీ కవాతు బృందం అత్యుత్తమ కవాతు బృందంగా ఎంపికైంది.

సీఏపీఎఫ్ /ఇతర సహాయక దళాల నుంచి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఉత్తమ కవాతు బృందంగా ఎంపికైంది.

జనవరి 26, 2022న గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పాల్గొన్న శకటాలలో ఉత్తరప్రదేశ్ శకటం ఉత్తమ శకటం గా ఎంపిక చేయబడింది. ఉత్తరప్రదేశ్ శకటం 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి మరియు కాశీ విశ్వనాథ్ ధామ్' అనే ఇతివృత్తంతో రూపొందింది.

'క్రెడిల్ ఆఫ్ ట్రెడిషనల్ హ్యాండ్ క్రాఫ్ట్' ఆధారంగా కర్ణాటక ప్రదర్శించిన శకటానికి రెండో స్థానం లభించింది. మేఘాలయ శకటానికి మూడవ స్థానం లభించింది. 50 సంవత్సరాల రాష్ట్ర హోదా మరియు మహిళల నేతృత్వంలోని సహకార సంఘాలు స్వయం సహాయక బృందాలకు నివాళి' పై మేఘాలయ తన శకటాన్ని రూపొందించింది.

కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాల తరగతిలో విద్యా మంత్రిత్వ శాఖ మరియు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ శకటాలు సంయుక్త విజేతలుగా నిలిచాయి. ' జాతీయ విద్యా విధానం' ఇతివృత్తంతో విద్య, నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ శకటం రూపొందింది. 'ఉడే దేశ్ కా ఆమ్ నాగ్రిక్' నినాదంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తన శకటానికి రూపకల్పన చేసింది. కవాతులో కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల నుంచి తొమ్మిది శకటాలు పాల్గొన్నాయి.

'సుభాష్ ఏ125' ఇతివృత్తంతో గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రదర్శించిన శకటం, 'వందే భారతం' నృత్య బృందం ప్రత్యేక బహుమతి తరగతిలో ఎంపిక చేయబడ్డాయి.

జనాదరణ అవార్డులు

మొదటిసారిగా ఓఎఉనీల ప్లాట్‌ఫారమ్ ద్వారా జనాదరణ తరగతిలో ఉత్తమ శకటం, ఉత్తమ కవాతు బృందాన్ని ఎంపిక చేసేందుకు ప్రజలకు అవకాశం కల్పించారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్ పోల్ జనవరి 25-31, 2022 మధ్య నిర్వహించబడింది.

జనాదరణ పొందిన ఎంపిక లో , భారత వైమానిక దళం కవాతు బృందం మూడు సర్వీసులలో అత్యుత్తమ కవాతు బృందంగా ఎంపిక అయ్యింది.

సీఏపీఎఫ్ /ఇతర సహాయక దళాల నుంచి పాల్గొన్న కవాతు బృందాలలో ఉత్తమ కవాతు బృందంగా ఓఎఉనీలలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఎక్కువ ఓట్లు పొంది ప్రథమ స్థానం పొందింది.

జనాదరణ విభాగంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పాల్గొన్న శకటాలలో మహారాష్ట్ర శకటం ఉత్తమ శకటంగా ఎంపిక అయ్యింది . దీనిని 'జీవవైవిధ్యం మరియు మహారాష్ట్ర రాష్ట్ర జీవ-చిహ్నాలు' అనే ఇతివృత్తంతో ప్రదర్శించారు. ఈ విభాగంలో ఉత్తరప్రదేశ్ శకటం ద్వితీయ స్థానం సాధించింది. ' మారుతున్న జమ్మూ కాశ్మీర్' పేరుతొ జమ్మూ కాశ్మీర్ ప్రదర్శించిన శకటానికి తృతీయ స్థానం లభించింది.

జనాదరణ విభాగంలో కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ/ తపాలా విభాగం శకటానికి అగ్ర స్థానం లభించింది. ' ఇండియా పోస్ట్: 75 సంవత్సరాల ఏ దీక్ష- మహిళా సాధికారత' ఇతివృత్తంతో ఈ శకటం సిద్ధమయ్యింది.

ఐఎస్‌బీ, పీజీపీ స్టూడెంట్స్‌కి బంపర్ ఆఫర్.. భారీగా జాబ్స్ ఇస్తున్న బడా కార్పొరేట్లు..

హైదరాబాద్, ఫిబ్రవరి 5:ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజి నెస్ (ఐఎస్‌బీ) పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్ మెంట్ (పీజీపీ) ? 2022 విద్యార్థులకు ప్రాంగణ నియామకాల్లో మంచి అవకాశాలు లభించాయి.

ప్రతిష్టాత్మక సంస్థలు ఆకర్షణీయ జీతభత్యాలతో ఉద్యోగాలు ఇచ్చేం దుకు ముందుకొచ్చాయి. ఈ బ్యాచ్ లో 9292 మంది విద్యార్థులు ఉండగా వారిలో 39 శాతం విద్యార్థినులు. కోవిడ్ నేపథ్యంలో హైదరాబా ద్- మొహాలీ ప్రాంగణాల విద్యార్థులకు వర్చుల్ విధానం లో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. 270 కార్పొరేట్ సంస్థల నుంచి వీరికి 2,066 ఉద్యోగాలు లభించాయి.

అంటే ఒక్కో విద్యార్థికి సగటున రెండు ఉద్యోగాలు లభించా యి. ఒక్కో విద్యార్థికి లభించిన సగటు వార్షిక వేతనం రూ.34.07 లక్షలుగా ఉంది. గత ఏడాది సగటు రూ.28.21 లక్షలతో పోల్చుకుంటే ఈసారి జీతభత్యాలు 20.78 శాతం పెరిగినట్లు ఐఎస్‌బీ వెల్లడించింది. వారు ఐఎస్‌బీలో చేరక ముందు చేసిన ఉద్యోగాల్లో లభించిన వేతనం కంటే పీజీపీ కోర్సు పూర్తి చేశాక లభించిన వేతనంలో 173 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం నియామకాల్లో మహిళలకు 41 శాతం అవకా శాలు లభించాయి.

కన్సల్టింగ్, ఐటీ, ఐటీఈఎన్, ఎఫ్ఎంసీజీ, రిటైల్, ఔషధ, ఆరోగ్య రంగాలకు చెందిన అగ్రశ్రేణి కార్పొరేట్ కార్పొరేట్ సంస్థలు ఉద్యోగాలను ఆఫర్ చేశాయి. ప్రపం చ వ్యాప్తంగా ఉన్న 10 అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లలో, ఒక బ్యాచ్‌లోనే 929 విద్యార్థులుండడం, ఐఎస్‌బీలోనే కావ టం మరొక ప్రత్యేకత. ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ ప్రొ ఫెసర్ రమభద్రన్ తిరుమలై మాట్లాడుతూ ప్రముఖ సం స్థలతో పాటు అంకుర సంస్థలూ ప్రతిభగల మానవ వన రుల కోసం ఐఎస్‌బీఐని ఆశ్రయిస్తున్నామని తెలిపారు. పీజీపీ వైవిధ్యమైనది. అత్యుత్తమమైనది కావడంతో కార్పొరేట్ సంస్థలను ఆకర్షించగలుగుతున్నామన్నారు.

తెలంగాణ ఆర్టీసీ బస్టాండ్ పరిశీలించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

నిర్మల్, ఫిబ్రవరి 5:: నిర్మల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించారు. బస్టాండ్ లో మౌలిక సౌకర్యాల పై అధికారులు ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ సంస్థకు చెందిన నిరుపయోగంగా ఉన్న స్థలాలను తమ అవసరాల మేరకు ఆయా శాఖలు ఆర్టీసీకి నష్టపరిహారం చెల్లించి అభివృద్ధి పనులు చేపట్టవచ్చని సీఎం కేసీఆర్ నిర్ణయించారని పేర్కొన్నారు.

నిర్మల్ పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణాకి ఆర్టీసీ సంస్థకు చెందిన స్థలాన్ని మున్సిపాలిటీకి కేటాయించినట్లు చెప్పారు. దీంతో మార్కెట్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి.ఆర్టీసి సంస్థకు నిర్మల్ మున్సిపాలిటీ డబ్బులు చెల్లించనుంది. అనంతరం మంత్రి మాట్లడుతూ సమీకృత మార్కెట్ నిర్మాణాకి ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ : విద్యార్థిని పొడిచిన ఆకతాయిలు

తిరుపతి, ఫిబ్రవరి 5: తిరుపతి నగరంలో మార్కెట్ సమీపంలో ఓ టీ స్టాల్ వద్ద విద్యార్థిని మద్యం మత్తులో సోడా బాటిల్ తో పొడిచిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది.. వివరాలిలా ఉన్నాయి.. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన మధు బాబు ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. టీ స్టాల్ వద్ద అప్పటికే మద్యం తాగుతున్న కొంతమంది మధుబాబు తో మాట మాట పెరిగి బాటిల్స్ తో దాడి చేయడం, విద్యార్థిని ఆ బాటిల్స్ తో పొడవడంతో 13 కుట్లు పడ్డాయి. చికిత్స నిమిత్తం రుయా హాస్పిటల్ కి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తాతయ్యగుంటకు చెందిన శివ, ఇనాయ తుల్లాలను అరెస్టు చేసినట్లు ఈస్ట్ ఎస్సై ప్రకాష్ తెలియజేశారు. మద్యం మత్తులో ఇలాంటి సంఘటనలు తిరుపతి నగరంలో అనేకంగా చోటుచేసుకుంటున్నాయి. పోలీసుల వరకు వస్తే పట్టీపట్టనట్లు కూడా ఉన్నట్లు విమర్శలు కూడా వస్తున్నాయి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆకతాయిలకు ముకుతాడు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధి పనుల పరిశీలన చేసిన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి

మెదక్ ఫిబ్రవరి 5 (నేటినిజం ప్రతినిధి) హవేలీ ఘనపురం మండలం పరిధిలోని కూచన్పల్లి గ్రామం లో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట శైలేష్ శనివారం పరిశీలించారు. ఈ ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని రోడ్లు, మురుగు కాలువలు, వైకుంఠధామం, నర్సరీ తో పాటు హరితహారం కార్యక్రమం లో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క బ్రతికేలా అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

గనుల శాఖలో సమ్మెను నిషేధించిన ఏపీ సర్కార్

అమరావతి, ఫిబ్రవరి 5:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గనుల శాఖలో సమ్మెను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులు విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. విధులకు హాజరుకాని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డైరెక్టర్ తెలిపారు. ఈరోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంత్రుల కమిటీ భేటీ అయిన విషయం విదితమే. అయితే ఆ తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడంతో చర్చనీయాంశంగా మారింది

స్వరం సవరించుకున్న సిద్దూ.. రాహుల్ మాటే నా మాట అంటూ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు నవజ్యోత్ సింగ్ సిద్దూ ఒక్క సారిగా యూటర్న్ తీసుకున్నారు. రాహుల్ గాంధీకి జై కొట్టారు. కొన్ని రోజుల నుంచీ ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై సిద్దూ సంచలన వ్యాఖ్యలు చేస్తూనే వున్నారు. ఓ రకంగా సీఎం చెన్నీ, అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయాలకు వ్యతిరేక కామెంట్లు చేస్తున్నారు. ఆదివారం రాహుల్ గాంధీ పంజాబ్‌లో పర్యటించనున్నారు. సీఎం అభ్యర్థిని కూడా ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో సిద్దూ ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నారు. సీఎం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటానని తేల్చి చెప్పారు.

పదవుల కోసం తాను రాజకీయాల్లో లేనని, మార్పు కోసమే రాజకీయాల్లో వున్నానన్నారు. పార్టీ అధిష్ఠానం మాటే నా మాట అని ప్రకటించారు. చివరి శ్వాస వరకూ తాను కాంగ్రెస్‌లోనే వుంటానని, తనను ముఖ్యమంత్రి చేసినా, చేయకపోయినా కాంగ్రెస్‌లోనే వుంటానని సిద్దూ తేల్చి చెప్పారు. పదవుల కోసం రాజకీయాల్లో లేను. మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చా. పార్టీ హైకమాండ్ నిర్ణయమే నా నిర్ణయం. నా తుది శ్వాస వరకూ కాంగ్రెస్‌లోనే. ముఖ్యమంత్రిగా ప్రకటించినా, ప్రకటించకపోయినా కాంగ్రెస్‌తోనే నా ప్రయాణం అని సిద్దూ ప్రకటించారు.

కొత్త జిల్లాలపై ప్రతిపక్షాలవి పసలేని ఆరోపణలు: మంత్రి బాలినేని

విజయవాడ, ఫిబ్రవరి 5:: కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రతిపక్షాలు అనవసర, పసలేని ఆరోపణలు చేస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేసేందుకు అవకాశాలు లేకపోవడంతో ఏదో ఒక వంక పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతున్నారన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు ప్రకటనను కొందరు స్వాగతించగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో జిల్లాల పేర్లపై అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా.. ఇంకొన్ని ప్రాంతాల్లో జిల్లా కేంద్రాలపై ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఈ ఆందోళనలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఆందోళనకారులకు మద్దతు తెలుపుతున్నారు. ప్రతిపక్షాల తీరుపు మంత్రి బాలినేని స్పందిస్తూ.. కొత్త జిల్లాలపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కడప జిల్లాలో రాజంపేట పార్లమెంట్ పరిధిలో రాయచోటిని జిల్లా కేంద్రంగా, హిందూపురం పరిధిలో పుట్టపర్తిని కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాగా ప్రతిపాదించామని మంత్రి తెలిపారు. విదేశాల్లో కూడా సత్యసాయికి భక్తులు ఉన్నారని అందుకే భక్తులకు అనుకూలంగా ఉండేలా సత్యసాయి జిల్లాను ప్రతిపాదించినట్లు మంత్రి తెలిపారు. విజయవాడ జిల్లా కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లాను ప్రతిపాదించినట్లు బాలినేని స్పష్టం చేశారు. 14 ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా చంద్రబాబు ఒక జిల్లాకు ఎన్టీ రామారావు పేరు పెట్టకపోవడంపై మండిపడ్డారు. ఒంగోలుకు చెందిన గుప్తా ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ప్లెక్సీలు ప్రదర్శించినట్లు తెలిసిందని, అతడి వెనక ఎవరున్నారో అందరికీ తెలుసునని అభిప్రాయపడ్డారు.

ఆపిల్ నుంచి బడ్జెట్‌లో 5జీ ఫోన్.. 22 వేలతో అందుబాటులోకి..

హైదరాబాద్, ఫిబ్రవరి 5:ఆపిల్ కంపెనీకి చెందిన ఐఫోన్ అంటే చాలా మంది లైక్ చేస్తారు. దాన్ని చేతిలో పట్టుకుని స్టేటస్‌గా కూడా ఫీల్ అవుతుంటారు.

విశాఖ శారదాపీఠం వార్షికోత్సవాలకు సీఎం జగన్



అమరావతి, ఫిబ్రవరి 5:ఏపీ సీఎం వైఎస్ జగన్ విశాఖపట్నం పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 9న శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాల్లో సీఎం జగన్ పాల్గొననున్నారు. శారదాపీఠంలో నిర్వహించే రుద్రయాగం, రాజశ్యామల యాగం, అగ్నిహోత్ర సభ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

శారదాపీఠం వార్షికోత్సవాలకు రావాలంటూ పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి ఇటీవల సీఎం జగన్ ను ఆహ్వానించారు. శారదా పీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర ఇటీవల తాడేపల్లి విచ్చేసి సీఎం జగన్ కు ఆహ్వానపత్రిక అందజేశారు.

ఫిబ్రవరి 9న సీఎం జగన్ ఉదయం గన్నవరం నుంచి బయల్దేరి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో చినముషిడివాడలోని శ్రీ శారదా పీఠానికి వెళతారు. అక్కడి కార్యక్రమాలు ముగిసిన అనంతరం విజయవాడ తిరుగుపయనమవుతారు.

విద్యా సంవత్సరం కుదింపు.. సెలవుల్లో కోత.. ఎన్ఎంసీ కీలక నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 5:దేశంలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో వైద్యవిద్య ఆలస్యం కావడంతో 2021?22లో కొత్తగా చేరే ఎంబీబీఎస్ విద్యార్థులకు విద్యాసంవత్సర కాలపరిమితిని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) కుదించింది. మొదటి ఏడాది సహా అన్ని సంవత్సరాల వైద్యవిద్యను 11 నెలలపాటు నిర్వహించేలా ఆదేశాలిచ్చింది. తాజాగా సవరించిన నిబంధనలు కేవలం 2021-22 బ్యాచ్ వైద్య విద్యార్థులకే వర్తిస్తాయని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. సాధారణంగా ఫస్టియర్ కోర్సు కాలవ్యవధి 13 నెలలు, ఇతర సంవత్సరాల్లో 12 నెలలు ఉంటుంది. ఇందులో మొదటి ఏడాది ఒక నెల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. తాజా మార్పుల నేపథ్యంలో ఈ కాల వ్యవధిని రెండు నెలలు తగ్గించారు.

ఈ కోర్సును రోజువారీ తరగతుల్లో భాగంగా కొంత సమయాన్ని అదనంగా కేటాయించి బోధించాలని ఎన్ఎంసీ ఆదేశించింది. తొలి సంవత్సరం సహా మిగిలిన సంవత్సరాల్లోనూ పండుగలు, వేసవి సెలవులు కలుపుకొని సుమారు 2 నెలలు సెలవు దినాలుంటాయి. అయితే ఈ సెలవు రోజులను ఒక నెలకు కుదిస్తూ ఎన్ఎంసీ ఆదేశాలిచ్చింది. ఈ బ్యాచ్ విద్యార్థులకు అన్ని సంవత్సరాల్లోనూ ఆ ఏడాది మొత్తమ్మీద గరిష్టంగా నెల రోజుల సెలవులే ఉంటాయి.

దీంతో 11 నెలలపాటు విద్యాబోధన వారికి కొనసాగుతుంది. 2021?22 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఈ నెలలో తరగతులు ప్రారంభమై ఇదే ఏడాది డిసెంబర్‌లో ముగుస్తాయి.

2023 జనవరిలో ఈ బ్యాచ్ తొలి సంవత్సరం వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. మళ్లీ అదే సంవత్సరం ఫిబ్రవరి నుంచి 11 నెలలపాటు రెండో ఏడాది తరగతులుంటాయి. ఇలా కొనసాగే వారి వైద్యవిద్య 2026 జూన్‌లో తుది సంవత్సరం పరీక్షలతో ముగుస్తుంది. ఈ బ్యాచ్ విద్యార్థులకు సెలవులను కుదించి, బోధన కాలపరిమితిని పెంచారే తప్ప, పాఠ్యాంశాల్లో లేదా బోధనా విధానం, ప్రాక్టికల్స్‌లో ఎటువంటి మార్పులు చేయలేదని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. 2021?22 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల హౌస్ సర్జన్ కూడా ఏడాది పాటే ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలలు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని జాతీయ వైద్య కమిషన్ తాజాగా ఆదేశాలిచ్చింది.

14 నుంచి తరగతులు...

ఈ నెల 14 నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ వైద్య తరగతులు ప్రారంభించాల్సిందేనని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ఆ మేరకు రాష్ట్రాల్లో తొలి ఏడాది ప్రవేశాల ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది.

వెజ్ మార్కెట్ నిర్మాణంలో వేగం పెంచాలి

-వేములవాడ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టరు-అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో నిర్మిస్తున్న వెజ్ మార్కెట్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలను పెంచాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం కలెక్టర్ వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రగతిలో ఉన్న పలు అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చామకుంట వద్ద 2 కోట్ల 30 లక్షల రూపాయలతో సుమారు 16 గంటల స్థలంలో నిర్మిస్తున్న వెజిటేబుల్ మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. వైకుంఠధామం నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, త్వరగా వినియోగంలోకి తీసుకువచ్చేలా తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రగతిలో ఉన్న పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కోనాయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించిన కలెక్టర్, లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచాలని అధికారులకు సూచించారు. 1 లక్షా 30 వేల బ్యాగుల్లో మట్టిని నింపడం జరిగిందని కలెక్టర్ కు అధికారులు వివరించారు. సోమవారం నుండి మట్టి నింపిన బ్యాగుల్లో విత్తనాలు నాటాలని కలెక్టర్ అన్నారు.

-దేవస్థానంలో కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రెవెన్యూ, ఆలయ అధికారులతో కలిసి కాలినడకన ఆలయ పరిసరాలను, క్యూ లైన్లను పరిశీలించారు. జాతర నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేసే ప్రక్రియ త్వరగా చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. భక్తులకు మాస్కులు, నీటి సరఫరా పాయింట్లు ఎక్కడున్నాయో తెలిసేలా ఒక మ్యాప్ రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట ఆర్డీఓ వి. లీల, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్ రావు, మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, తహశీల్దార్ మునీందర్, తదితరులు ఉన్నారు.

అక్రమాలను సహించను.. అర్హులైన పేదలకే డబుల్ బెడ్రూం ఇండ్లు : స్పీకర్ పోచారం

కామారెడ్డి, ఫిబ్రవరి 5:: బాన్సువాడ నియోజకవర్గంలో ఇండ్లు లేని పేదవారందరికీ స్వంత ఇంటి నిర్మాణం నా ఆశయం. సీఎం కేసీఆర్ బాన్సువాడ నియోజకవర్గానికి 10 వేల డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేశారు. రాష్ట్రంలో మరే నియోజకవర్గానికి ఇన్ని ఇండ్లు మంజూరు కాలేదు. అవసరమైతే మరో 5 వేల ఇండ్లను మంజూరు చేయించి, విడతల వారిగా పేదలందరికి డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేస్తాను. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలను సహించను. అర్హులైన పేదలకు మాత్రమే ఇండ్లు అందేలా చర్యలు తీసుకుంటానని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

బాన్సువాడ పట్టణంలో రూ. 5.47 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.

ఈసందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నది. ఉచితంగా చేప విత్తన సరఫరా, చేపల విక్రయాల కోసం మార్కెట్లు నిర్మాణం, సబ్సిడీపై వాహనాలు అందిస్తున్నది. ఇప్పటికే తెలంగాణ ఇతర రాష్ట్రాలకు చేపలను ఎగుమతి చేస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని మత్స్య కార్మికులు అందిపుచ్చుకుని బాగుపడాలి. దళారులు, మధ్యవర్తులను దగ్గరకు రానీయొద్దు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక బాన్సువాడ పట్టణ అభివృద్ధి కోసం, పట్టణ ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు, సౌకర్యాల కోసం కోట్ల రూపాయలు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించాం అని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మించబోయే పోలీసు షాపింగ్ కాంప్లెక్స్ కు స్పీకర్ భూమిపూజ చేశారు. రూ. 2 కోట్లతో బాన్సువాడ నూతన పురపాలక సంఘం భవనం నిర్మాణం పనులకు శంకుస్థాపన, రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించబోయే ఎమ్మార్వో భవనానికి శంకుస్థాపన, రూ. 2 కోట్లతో నూతన వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కు శంకుస్థాపన చేశారు. రూ. 67 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫిష్ మార్కెట్ భవనాన్ని స్పీకర్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ బి. శ్రీనివాస రెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఐదేండ్ల కొకసారి పీఆర్సీకి ఏపీ మంత్రుల కమిటీ సుముఖత

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల వేతనాల పెంపుదల పాత విధానం ప్రకారమే ప్రతి ఐదేండ్ల కొకసారి అమలు చేయ డానికి ఏపీ పీఆర్సీ మంత్రుల కమిటీ సుముఖత వ్యక్తం చేసింది . సచివాలయంలో పీఆర్సీ సాధన సమితి నాయకులతో మంత్రుల కమిటీ ఉద్యోగుల సమస్యలపై మరోసారి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ఏ స్లాబులపై మంత్రుల కమిటీ కొత్త ప్రతిపాదనలు ఉంచింది. 50వేల లోపు జనాభా ప్రాంతాల్లో రూ.10వేల సీలింగ్‌తో 8శాతం హెచ్ఆర్ఏ.. రెండు లక్షల్లోపు జనాభా ప్రాంతాల్లో రూ.10వేల సీలింగ్‌తో 9.5శాతం, 5లక్షల లోపు జనాభా ప్రాంతాల్లో రూ.12 వేల సీలింగ్‌లో 13.5 శాతం, 10 లక్షల్లోపు జనాభా ప్రాంతాల్లో రూ.15వేల సీలింగ్‌తో 16శాతం హెచ్ఆర్ఏ ఇస్తామని పేర్కొన్నారు. ఐఆర్ రికవరీని చేయబోమని స్పష్టం చేసిన మంత్రుల కమిటీ స్పష్టం చేసింది. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రొబేషన్ తర్వాత కొత్త పీఆర్సీ ప్రకారమే వేతనాలు ఇస్తామని ఫిట్‌మెంట్ 23శాతమే ఇస్తామని మంత్రులు స్పష్టం చేశారు.

రోడ్ల నిర్మాణం కోసం అటవీ అనుమతులకు సమన్వయంతో పనిచేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రజల అవసరాలు, నిరంతర అభివృద్ధికి దోహదపడేవి విస్తృతమైన రహదారుల నిర్మాణమేనని అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. అన్ని స్థాయిల్లో 181 (మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్, ఎన్.హెచ్, మావోయిస్టు ప్రభావిత, ఆర్ అండ్ బీ పరిధిలో) రహదారుల నిర్మాణం, అనుమతుల వేగవంతంపై అటవీ, రోడ్ల భవనాల శాఖల మధ్య సమన్వయ సమావేశం శనివారం అరణ్య భవన్ లో జరిగింది. రాష్ట్ర పరిధిలో పూర్తి స్థాయి రోడ్ నెట్ వర్క్, కొత్త జాతీయ రహదారులు, వ్యూహాత్మక ఎలివేటెడ్ రోడ్ కారిడార్ల నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరుకుంటున్నారని శాంతి కుమారి తెలిపారు. అన్ని రకాల అనుమతుల సాధన కోసం డెడ్ లైన్లు పెట్టుకుని పనిచేయాలని, ప్రత్యామ్నాయ అటవీకరణ కోసం భూ సేకరణ కోసం జిల్లా స్థాయి అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని రెండు శాఖల అధికారులకు సూచించారు.

ఆయా రోడ్ ప్రాజెక్టుల అనుమతుల విషయంలో అన్ని రకాల జాప్యాలను నివారణ కోసం, పనులు చేస్తున్న సంబంధిత శాఖలు (యూజర్ ఏజెన్సీలు) అటవీ, పర్యావరణ అనుమతులకు సంబంధించి జాతీయ స్థాయిలో ఉన్నటువంటి కఠిన నిబంధనలను అర్థం చేసుకుని, అందుకు అనుగుణంగా అనుమతుల పత్రాలను ఆన్ లైన్ లో పొందు పర్చాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్.శోభ కోరారు. అనుమతుల విషయంలో శాఖ పరంగా సహకరించేందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారని వెల్లడించారు. స్టేజ్ -1, స్టేజ్ -2 దశల్లో ఉన్న రోడ్ ప్రాజెక్టులు, ఎక్కడ ఏ దశల్లో పెండింగ్ లో ఉన్నాయన్న విషయంపై ప్రాజెక్టుల వారీగా సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన పథకాల్లో నేషనల్ హైవేల నిర్మాణం కూడా ఉన్నందున, ఆ అవకాశాన్ని పూర్తి సద్వినియోగం చేసుకుని వీలైనన్ని నిధులు రాబట్టుకొని పనులు పూర్తి చేయటం రెండు శాఖల మధ్య సమన్వయంతో సాధ్యం అవుతుందని రోడ్లు, భవనాల శాఖ సెక్రటరీ శ్రీనివాస రాజు అన్నారు. ఈ సమీక్షాసమావేశంలో పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం. దోబ్రియల్, అటవీ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంతి, ఆర్.అండ్.బీ స్పెషల్ సెక్రటరీ బి. విజయేంద్ర, సలహాదారు (రిటైర్డ్ ఈఎన్సీ) గణపతి రెడ్డి, చీఫ్ ఇంజనీర్ పీ. సతీష్, డీసీఎఫ్ శ్రీనివాస రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు నిల్వలు పెంచుకోవాలి.. వేసవిలో కరెంట్ సమస్య రానివ్వొద్దు : ఏపీఈఆర్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 5:రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వేసవిలోనూ నిరాటంకంగా, తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోవాలని, అప్పటి డిమాండ్‌ను అంచనావేసి ముందే బొగ్గు నిల్వలు పెంచుకోవాలని డిస్కమ్‌లకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) సూచించింది. ఎక్స్ఛేంజీలు, మార్కెట్ల లో లభ్యమయ్యే విద్యుత్ ధరల అస్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తమవ్వాలని ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎక్స్ఛేంజీలు మార్కెట్లలో లభ్య మయ్యే విద్యుత్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, తగినంత బొగ్గు నిల్వలు లేకపోవడం వలన తక్కువ ధరల్లో విద్యుత్ అందించే థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి విద్యుత్ తీసుకోలేని పరిస్థితులేర్పడ తాయని హెచ్చరించింది. ఎక్స్ఛేంజీలు, మార్కెట్లపై ఆధారపడితే విద్యుత్ పంపిణీ సంస్థలపైన అంతి మంగా వినియోగదారులపై అదనపు ఆర్థికభారం పడుతుందని తెలిపింది. ఈ విషయాలని దృష్టిలో ఉంచుకొని, రాబోయే వేసవిలో అదనపు వ్యయాన్ని తగ్గించేందుకు ఇప్పటినుండే కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించింది. ఇందులో భాగం గా అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు గడచిన రెండు మూడేళ్లలో వేసవిలో నెలకొన్న డిమాండ్ ఎంతమేర ఉందో దానిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన బొగ్గు నిల్వలను ఇప్పటినుండే అందుబాటులో ఉం చుకోవాలని తెలిపింది.

ఈమేరకు కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టంచేసింది. ఈఏడాది ఫిబ్రవరి నెలలో 400 మెగావాట్లు, మార్చి నెలలో 390 మెగావాట్ల విద్యుత్‌ను మాత్రమే రోజంతా కొనడానికి విద్యుత్ పంపిణీ సంస్థలకు మండలి అనుమతించిందని తెలియజేసింది. ఆప్రకారం, విద్యుత్ పంపిణీ సంస్థలు విజయవంతమైన బిడ్డర్లకు పైన చెప్పిన విద్యుత్ పరిమాణానికి కొనుగోలు పత్రం జారీ చే యాలని, వారితో దానికి సంబంధించిన స్వల్పకాలిక సరఫరా ఒప్పందం కుదుర్చుకోవాలని మండలి ఆదేశించింది. అయితే, వేలంపాటదారులు కోట్ చేసి న అధిక ధరల కారణంగా కమిషన్ మాత్రం ఏప్రిల్, మే నెలల్లో కొనుగోలుకు సంబంధించిన బిడ్లను మాత్రమే అనుమతించినట్లు తెలిపింది. అలాగే పిబ్రవరి నుండి మే నెల వరకూ గరిష్ట వినియోగ సమ యాల్లో (సాయంత్రం 5 గంటల నుండి రాత్రి ఒంటి గంట వరకూ) మాత్రమే కొనుగోలుకు అనుమతిచ్చి నట్లు స్పష్టంచేసింది. ఈక్రమంలోనే డిస్కంలు బిడ్లను ఖరారు చేయడంలో జాప్యం కారణంగా జనవరి ప్రతిపాదన అసంబంధ్ధంగా ఉందని ఏపీఈఆర్సీ పేర్కొంది.

ఈ నెల 12 జెడ్. పి. సాధారణ సర్వ సభ్య సమావేశం..!

మెదక్, ఫిబ్రవరి 5 (నేటి నిజం ప్రతినిధి) జిల్లా పరిషద్ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ అధ్యక్షతన జెడ్. పి. సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 12 న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నామని జిల్లా పరిషద్ కార్యనిర్వాహన అధికారి శైలేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరయ్యే ఇట్టి సమావేశానికి అధికారులందరు సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

ఏపీలో కొత్తగా 3396 కరోనా కేసులు

అమరావతి, ఫిబ్రవరి 5:ఏపీలో కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా కరోనా కేసులు తగ్గుతూ వస్తున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన హెల్త్ బులెటిన్ ప్రకారం? ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 3396 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఆంధ్రప్రదేశ్ లో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 23,00,765 కి పెరిగింది. కోవిడ్ వల్ల అనంతపురము, నెల్లూరు, ప్రకాశంలలో ఇద్దరు, చిత్తూరు, గుంటూరు, కర్నూలు లో ఒక్కొక్క రు చొప్పున మరణించారు.

దీంతో కరోనా బారిన పడి మరణించిన వారి సంఖ్య 14,655 కి చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 78,746 యాక్టివ్ కరోనా కేసులున్నాయి. ఇక గడిచిన 24 గంటల్లో 13,005 మంది బాధితులు కరోనా మహమ్మారి నుంచి కోలుకున్నారు. ఇక ఇప్పటి దాకా కరోనా బారిన పడి డిశ్చార్జ్ అయిన వారి సంఖ్య 22,07,364 లక్షలకు చేరింది. ఇప్పటి దాకా 3,26,32,089 కరోనా పరీక్షలు చేసినట్టు ఏపీ వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

దేశంలో కొత్తగా 1,27,952 కరోనా కేసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశంలో వరుసగా రెండో రోజూ కరోనా కేసులు తగ్గాయి. శుక్రవారం 1.49 లక్షల కేసులు నమోదవగా, తాజాగా 1.27 లక్షల మంది కరోనా బారినపడ్డారు. ఇవి నిన్నటికంటే 9.2 శాతం తక్కువ అని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. రోజువారీ కేసులు తగ్గడంతో పాజిటివిటీ రేటు కూడా పడిపోయింది.

దేశంలో కొత్తగా 1,27,952 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసులు 4,20,80,664కు చేరాయి. ఇందులో 13,31,648 కేసులు యాక్టివ్‌గా ఉండగా, 5,01,114 మంది బాధితులు మృతిచెందారు. ఇప్పటివరకు 4,02,47,902 మంది బాధితులు కరోనా నుంచి కోలుకున్నారు. ఇక కొత్తగా 1059 మంది మరణించగా, 2,30,814 మంది మహమ్మారి నుంచి బయటపడ్డారు.

ఇక రోజువారీ పాజిటివిటీ రేటు 7.98 శాతంగా ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,68,98,17,199 కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని తెలిపింది.

కన్వీనర్ కోటా బీడీఎస్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

వరంగల్, ఫిబ్రవరి 5:: కన్వీనర్ కోటాలో బీడీఎస్ సీట్ల భర్తీకి కోసం కాళోజీ హెల్త్ యూనివర్శిటీ వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 6 నుంచి బీడీఎస్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించింది. ఆప్షన్లకు ఫిబ్రవరి 8వ తేదీ వరకు తుది గడువును విధించింది. ఒకేసారి అన్ని కళాశాలలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు.

అసెంబ్లీ ఎదురుగా ఘోర రోడ్డు ప్రమాదం

హైదరాబాద్, ఫిబ్రవరి 5: నగరంలోని అసెంబ్లీ ఎదురుగా శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు కింద పడి మురళీ కృష్ణ అనే ప్రభుత్వ ఉద్యోగి చనిపోయారు. స్కూటీ మీద వెళ్తున్న మురళీ కృష్ణ.. బస్సు వెనుక చక్రం కింద పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, మురళీ కృష్ణ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

సృజనప్రియ | సృజన నేడు
ప్రజల పక్షాన అక్షర సమరం

రజతోత్సవం సందర్భంగా కథలు, కవితల పోటీ

ఉత్తమ రచనలకు ఇదే మా ఆహ్వానం

'సృజనప్రియ'
మీ అందరి ఆదరాభిమానాలతో 25 వసంతాలు పూర్తి చేసుకుని రజతోత్సవ వేడుకలకు సమాయత్తమవుతున్న శుభతరుణమిది. ఈ సందర్భంగా ప్రత్యేక విశేష సంచికను తీసుకువస్తున్నాం. పాఠకుల ఆదరాభిమానాలతో విజయవంతంగా దూసుకెళ్తున్న మన పత్రిక పట్ల మీరు చూపుతున్న ఆదరణ మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

రోజ్ పబ్లికేషన్స్ ద్వారా 'సృజనప్రియ' మాసపత్రిక స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా కథ, కవితల పోటీలు నిర్వహిస్తున్నాం. కథ/కవిత ఇతివృత్తం వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేదై వుండాలి. కథ, కవిత తప్పులు లేకుండా కాగితానికి ఒకవైపు మాత్రమే డి.టి.పి. చేసిన నాలుగు పేజీల కథ, ముప్పయి వరుసలు మించని ఉత్తమ కవితలకు ఆహ్వానం పలుకుతున్నాం. వస్తువు ఎంపికలో కవికి/కథకునికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. తమ కథ/కవిత ఎక్కడా ప్రచురితం కాలేదని బ్లాగుల్లో వెబ్ మేగజైన్లలో కూడా రాలేదని,ఎక్కడా ప్రచురణకు గాని,ప్రసారార్థం కు గాని పరిశీలనలో లేదని హామీపత్రంలో రాయాలి.హామీ పత్రం జతచేయని కథ/కవిత పోటీకి పరిగణించబడవు.హామీపత్రంలోనే తమ చిరునామా ఫోన్ నెంబర్ రాయాలి. కథ/కవిత పేజీలపై ఎక్కడా పేరు,చిరునామా, ఫోన్ నెంబరు రాయకూడదు.

కథ మొదటి బహుమతి రూ.5000,
రెండవ బహుమతి రూ.3000
మూడవ బహుమతి రూ.2000
కన్సోలేషన్ బహుమతులు ఐదు. ఒక్కొక్కటి రూ.1000

కవిత మొదటి బహుమతి రూ.3000,
రెండవ బహుమతి రూ.2000
మూడవ బహుమతి రూ.1000.
ప్రత్యేక బహుమతులు ఐదు.ఒక్కొక్కటి రూ.500

పోటీ గడువు పొడిగించేందుకు కానీ అర్హమైన కథలు/కవితలు రాకపోతే బహుమతుల్లో మార్పులు చేర్పులు చేసే వీలు 'రోజ్ పబ్లికేషన్స్' యాజమాన్యానికి ఉంటుంది. కథ/కవిత ఎంపిక విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు, వాదోపవాదాలు జరుపబడవు. పోటీకి, ప్రచురణకి అనర్హమైన కథలు/కవితలు తిప్పి పంపుట సాధ్యం కాదు. కావున యాజమాన్యంతో సహకరించగలరు. బహుమతి పొందిన కథలను/కవితలను సాధారణ ప్రచురణగా సృజనప్రియ మాస పత్రిక/సృజననేడు దినపత్రిక సాహిత్య పేజీలో వేయు అధికారము యాజమాన్యానికి కలదు. కథ/కవిత ఒక్కొక్కటి మూడు కాపీలు స్పీడ్ పోస్ట్/లిజిస్టర్ పోస్ట్/డి టి డి సి కొరియర్ లో మాత్రమే పంపాలి. సాధారణ పోస్టులో పంపే రచనలు మాకు చేరకపోతే మేము బాధ్యత వహించము.
బహుమతులు గెలుచుకున్న రచయితలకు/ కవులకు నగదు బహుమతితో పాటు రజతోత్సవ వేడుకలలో ప్రముఖుల సమక్షంలో సత్కారం ఉంటుంది.రజతోత్సవ వేడుకలు ఏప్రిల్/మే నెలలో ఉండవచ్చు. బహుమతి పొందిన కవులు/రచయితలు రజతోత్సవ వేడుకలకు హాజరై బహుమతులు అందుకోవలసి ఉంటుంది.

కథలు/కవితలు పంపవలసిన చిరునామా :
కొమ్మవరపు విల్సన్ రావు, ఇం. నెం.5-2-396/ SS /P42
జక్కిడి రాంరెడ్డి కాలనీ, సాహెబ్ నగర్ కలాన్
వనస్థలిపురం,హైదరాబాద్-500 070
ఫోన్ నంబర్: 89 85 43 55 15
ఇతర వివరాలకు పైన తెలిపిన ఫోన్ నంబర్ లో సంప్రదించవచ్చును.

కథ/కవిత చేరవలసిన ఆఖరి తేదీ: మార్చ్ 15, 2022.

నీలం దయానంద రాజు
చీఫ్ ఎడిటర్, సృజనప్రియ మాసపత్రిక, సృజననేడు దినపత్రిక

మీకోసం

నేటినిజం లో..

'స్వీయ పరిచయవేదిక' త్వరలో...

వారం, వారం వర్ధమానులు, ప్రవర్ధమానులు తమ రచనల్ని అందించడానికి అనువైన పత్రికగా భాసిల్లుతున్న 'నేటినిజం'' మరో కొత్త శీర్షికకు త్వరలో శ్రీకారం చుట్టబోతోంది. అనేక మంది కవులు, కవయిత్రులు తమ సాహితీ ప్రస్థానాన్ని 'నేటినిజం' స్వాగత తోరణం ద్వారానే ప్రారంభించిన వారున్నారు. ప్రసిద్ధులుగా తమ రచనల ద్వారా పాఠకుల హృదయాల్లో చోటు చేసుకున్న వారం సైతం చాలా మంది క్రమం తప్పకుండా పత్రికను ఆదరించి, ఆశీర్వదిస్తున్నారు.

కొత్తగా కలంపట్టే వారికి ప్రేరణనందించే విధంగా ప్రసిద్ధ కవులు, రచయితలు తమ రచనల ద్వారా 'నేటినిజం'లో ప్రేరణనందించడాన్ని చూస్తున్నాం. సాహిత్య సృజన చేస్తున్న కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులను పరిచయం చేసేందుకు లోగడ 'నేటినిజం' ద్వారా విశేష కృషి జరిగిన విషయం మీకు తెలిసిందే.. ఇదే క్రమంలో కలం పట్టి సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న సృజనకారులు తమకు తామే స్వీయ పరిచయం చేసుకునేందుకు.. 'నేటినిజం' ముందుకు రాబోతున్నది. 'స్వీయ పరిచయ వేదిక' అన్న శీర్షికతో ప్రతివారం సాహితీ కెరటాల ద్వారా అందించాలని సంకల్పిస్తున్నాం..

ఈ సందర్భంగా దిగువ సూచనలు గమనించి
తమ పరిచయాన్ని తామే పంపించగలరని కోరుతున్నాం..

సూచనలు:

1) ఇదివరకే తమ రచనల ద్వారా సాహితీ లోకానికి కవులుగా, రచయితలుగా, పరిచయమున్నప్పటికీ.. మీ, మీ మాటల్లోనే మీ గురించి రాసిన పరిచయ వాక్యాలను ఇంకా సమగ్రంగా సాహితీ బంధువులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రారంభించబడుతున్న శీర్షిక ఇది. కనుక వాస్తవ విషయాలనే ప్రస్తావిస్తారన్న విశ్వాసముంది. వాస్తవాలనే పంపాలన్న సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

2) పేరు, వృత్తి, చిరునామా.. ఇత్యాది విషయాలను మొదట పేరాలో మీకు మీరే పరిచయం చేసుకోవాలి.

3) రచనా వ్యాసంగంలోకి కవిగా, రచయితగా ప్రవేశించిన సం॥... తమ తొలి రచన.. ఇత్యాది వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

4) సాహితీ లోకంలో సృజనకారులుగా అడుగులు వేయడానికి మీకు ప్రేరణనిచ్చింది ఎవరు? వారికి సంబంధించి మీకు ఏ రచన ప్రభావితం చేసింది? వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

5) ఇప్పటి వరకు రాసిన కవితలసంఖ్య, వ్యాసాల సంఖ్య, కథలు.. ఇతరత్రా ప్రక్రియల్లో మీరు ప్రదర్శిస్తున్న ప్రతిభకు సంబంధించిన వివరాలు-సంక్షిప్తంగా..

6) మీరు వెలువరించిన గ్రంథాలు.. ప్రక్రియలు.. ఏయే సంవత్సరాల్లో.. తదితర వివరాలు.. పుస్తకాల పేర్ల జాబితాను పొందుపరచాలి.

7) మీరు పొందిన సాహిత్య పురస్కారాలు.. లిస్ట్ పొందు పరువచ్చు. పొందుపరిచే క్రమంలో.. ముఖ్యమైన వాటినే ప్రస్తావించాలి.

8) మీరు పొందిన బిరుదులు-వివరాలు-అందించిన సంస్థలు-వాటి వివరాలు

9) మీరు రచించిన కవితల్లో/ కథల్లో/ రచనల్లో మీకు బాగా నచ్చింది ఏమిటి? వివరాలు సంక్షిప్తంగా పొందుపరచవచ్చు.

10) మీరు పాల్గొన్న సభల్లో మీకు బాగా నచ్చిన సభ.. వివరాలు అందించండి.

11) ప్రసిద్ధ కవులు-రచయితలతో సభను పంచుకున్న సభలనూ వివరించవచ్చు.

12) మీ ద్వారా సాహితీకారులకు పురస్కారాలు అందిస్తే వివరాలు తెల్పండి.

13) మీరు ఏదైనా పత్రికకు కాలమిస్టుగా వ్యవహరిస్తే.. వివరాలు రాయాలి.

14) మీరు వెలువరించిన గ్రంథాలకు సంబంధించిన గ్రంథాల టైటిల్ పేజీలను మీకు ఇష్టమైన వాటిని **ఐదు**కు మించకుండా పంపాలి.

15) మీ సాహిత్య ప్రస్థానంలో మీరు పాల్గొన్న సభలకు సంబందించిన ఫోటోలు ఉంటాయి. వాటిలో కూడా అతి ముఖ్యమైన వాటిని ఎంపిక చేసుకుని **ఐదింటి**ని మాత్రమే పంపాలి.

16) మీ రచనలపై ఏ విశ్వ విద్యాలయంలోనైనా పాఠ్యాంశాలుగా నిర్ణయింపబడితే వాటి వివరాలు ఇవ్వండి.

17) మీ రచనలపై ఏ విశ్వవిద్యాలయంలోనైనా పరిశోధనలు జరుగుతున్నట్లయితే వివరాలు.. అందించండి..

18) సాహిత్య సంస్థల నిర్వహణలో మీకున్న భాగస్వామ్యం వివరాలు-

19) ఇప్పుడొస్తున్న కవిత్వం/ కథలు/ ఇతర సాహిత్యంపై మీ అభిప్రాయం.

20) మంచి కవిత్వానికి/ కథకు/ రచనకు ఉండాల్సిన లక్షణాలు.. ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?

21) ఇప్పుడొస్తున్న అంతర్జాల కవిత్వ సమూహాలు.. కవిత్వ సృజన జరుగుతున్న తీరు తెన్నులపై మీ అభిప్రాయం.

22) ఆధునిక సమాజంలో ఏ విధమగు సాహిత్యం/ కవిత్వం/ కథలు రావాలని కోరుకుంటున్నారు?

23) మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో పంపాలి.

పై అంశాల్లో మీకు సంబంధించిన వివరాలు ఉంటేనే మీ పరిచయ వ్యాసంలో పొందుపరచాలి. సంబంధం లేని అంశాలను వదిలేయాలి.. 'ఏమీ లేవు' అని పేర్కొనవలసిన అవసరం లేదు.

వివాదాస్పదమైన విషయాలను రచనలను అసలే ప్రస్తావించకూడదన్న విషయం మీకు తెలియందికాదు.

స్వీయ పరిచయానికి సంబంధించి మీరు ఇంకేమైనా ప్రస్తావించ దలుచుకుంటే ప్రస్తావించవచ్చు.

మీ పరిచయం వ్యాసం మూడు అరకాలుకు మించకూడదు.

బాగా ఆలోచించాకే విశేషాల వివరాలు పొందుపరచాలి. మళ్లీ మార్పులు-చేర్పులు చేయడానికి వీలుండదు.

'నేటినిజం'లో మీ పరిచయాన్ని ముద్రించే విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే..

ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలకు.. ఫోన్ సంప్రదింపులకు అవకాశం లేదు.

వీలు వెంబడి క్రమంగా ఒక్కోవారం ఒక్కో సృజనకారుని పరిచయం ప్రచురించడం జరుగుతుంది. మీ వంతు వచ్చేవరకు వేచి ఉంటారన్న విశ్వాసముంది.

ఇంకా ఆలస్యం దేనికి?

పై సూచనలు పాటిస్తూ మీ పరిచ వ్యాసం రాసి పంపండి..

E-mail : netinizam2020@gmail.com

– బైస దేవదాసు
సంపాదకులు: 'నేటినిజం'

చెడు అలవాట్లకు పెడదారి పట్టకుండా క్రీడపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

-కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి):చిన్నారులు చిన్నప్పటినుండి చెడు అలవాట్లకు దూరంగా ఉండటానికి పెడ దారి పట్టకుండా క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని 3 వ వార్డు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ అన్నారు.శనివారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజూపల్లి లో వేములవాడ పి ఎసి సీఎస్ ఛైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి సౌజన్యంతో వేములవాడ డివిజన్ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలను ఆయన ప్రారంభించి .ఈ సందర్భంగా కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ చిన్నప్పటి క్రీడలపై ఆసక్తి కనబర్చని చాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అనంత రెడ్డి ,న్యాయవాది, సీనియర్ నాయకులు గుడిసెసదానందం , వేములవాడ 2.వ వార్డు తెరాస అధ్యక్షులు గుడిసె అనిల్ కుమార్ , సుభాష్ యూత్ క్లబ్ అధ్యక్షులు వి . సాయి బాబు గ్రామ ప్రజలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు .

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూసే బాధ్యత ప్రతీ ఒక్కరిది

- వేములవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.చంద్రకాంత్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి):శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూస్తే బాధ్యత ప్రతీ ప్రతి ఒక్కరిది అని వేములవాడ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్. చంద్రకాంత్ అన్నారు.

వేములవాడ పట్టణం లోని దుకాణదారులతో వేములవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.చంద్రకాంత్ గ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది అని పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా డి ఎస్ పి మాట్లాడుతూ దుకాణదారులు రోడ్లను ఆక్రమించి దుకాణాలు పెట్టకూడదు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా కూడా చూడాలని, నిబంధనలు ఉల్లంగిస్తే కేసులు తప్పవు అని, మున్సిపల్ వారి సహకారం తో కలిసి చర్యలు తీసుకుంటాం అని, భక్తులు తమకు నచ్చిన దుకాణం లో తమకు రేట్ నచ్చితేనే కొనుకుంటారు అని వారిని ఇబ్బందులకు గురి చేయకూడదు అని అందరు సహకారం ఉంటే మన వేములవాడ కి మంచి పేరు తీసుకు రావటం లో మీదే ప్రముఖ పాత్ర అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఇన్స్పెక్టర్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్, సబ్ ఇన్స్పెక్టర్ రమేష్, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, పట్టణ దుకాణదారులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో ముఖద్వారం కామాన్ ప్రారంభోత్సవం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం ఆర్ ఆర్ కాలనీ రోడ్ నెంబర్ ఐదు లో గాలి పెల్లి సువర్ణ స్వామి ఎంపిటిసి , గౌడ సంఘం పలువురు కులస్తులు ముఖ ద్వారం (కమాన్) రూ. 2.50.000 వేయి లు ఖర్చుతో నిర్మాణం చేయడం జరిగినది

శనివారం స్థానిక సర్పంచ్ ఉరిడి రాంరెడ్డి ఎంపిటిసి గాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్ ,గ్రామ పంచాయతీ పాలకవర్గం, గౌడ సంఘం ఆధ్వర్యంలో కమాన్ ప్రారంభోత్సవం చేయడం జరిగినది. అలాగే ఎల్లమ్మ ఆలయం వద్ద వంటశాల గది నిర్మాణం కోసం భూమి పూజ చేశారు . ఎల్లమ్మ గుడి వద్ద కి ఇతర గ్రామాల నుండి స్థానికులు ఎల్లమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకొని వంటల్లో చేయటానికి వంటశాల లేక ఇబ్బందిగా ఉంది కాబట్టి గౌడ సంఘం సోదరులు దాతలను విరాళం కోరగా మల్యాల మహేందర్ గౌడ్ మల్యాల హరికృష్ణ గౌడ్ ముందుకు వచ్చి 1.లక్ష 30 వేయిలు వంట శాల రూమ్ నిర్మాణం కొరకు విరాళం అందజేశారు .వీరితో పాటు కమాన్ ప్రారంభోత్సవానికి , వంట శాల గది నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన సర్పంచ్, ఎంపిటిసి, పాలకవర్గానికి గౌడ కులబాంధవులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రెసిడెంట్ పచ్చిమట్ల మహేష్ వైస్ ప్రెసిడెంట్ కట్ట గణేష్ , రవి ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ వార్డ్ మెంబర్ తునికి నరసయ్య కనకరాజు హరికృష్ణ తిరుపతి కనకయ్య దేవయ్య ప్రవీణ్ ఎక్ససర్పంచ్ పిల్లి కనకయ్య పర్వత రామచంద్రం మాజీ ఎం పి టి సి వంకాయల భూమయ్య , గోనె భాస్కర్ మెడికల్ రాజిరెడ్డి , బక్కయ్య కార్యదర్శి దిలీప్ రెడ్డి గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

జోగాపూర్‌లో జ్ఞాన సరస్వతి విగ్రహం ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని శనివారం జడ్పీటీసీ నాగం కుమార్ ఆవిష్కరించారు. చింతలఠాణా గ్రామానికి చెందిన ఆర్ సి రావు తన తాత రేగులపాటి కిషన్ రావు స్మారకార్థం సరస్వతి విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. వసంత పంచమి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుల తల్లి సరస్వతి విగ్రహాన్ని అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివిమంచి ఫలితాలు సాధించాలన్నారు. స్థానిక జడ్పిటిసి నాగం కుమార్ రూపాయలు 10.000.వేలు ఎంపీటీసీ మ్యాకల గణేష్ రూపాయలు 5,000. సర్పంచ్ మ్యాకల పర్శరాములు 5000. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎడ్ల కేషన్ 5000 వేలు. విద్యా కమిటీ చైర్మన్ తిరుపతి 5000. పిఆర్టియు జిల్లా అధ్యక్షులు గన్నమనేని శ్రీనివాసరావు 5000వేలు. గజవాడ శ్రీనివాస్ 5000. కనుకయ్య 5000.విరాళాలు అందజేశారు. అలాగే గ్రామస్తులు కూడా మరికొన్ని విరాళంగా అందజేశారు. పాఠశాలలో హోమం కార్యక్రమాన్ని కూడా నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందజేసిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకల పర్శరాములు. ఎంపిటిసి మ్యాకల గణేష్. సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్. వేములవాడ రూరల్ వైస్ ఎంపీపీ ఆర్ సి రావు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎడ్ల కిషన్. సఖి కేంద్రం నిర్వాహకురాలు రోజా. టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య. కో - ఆప్షన్ బత్తుల కమలాకర్. విద్యా కమిటీ చైర్మన్ తిరుపతి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు, పాఠశాలలో సరస్వతి విగ్రహం. అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు కిషన్ ను అభినందించారు.

జై విజ్ఞాన్..జై అనుసంధాన్ : తోమర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5:జై జవాన్.. జై కిసాన్ మనందరికీ తెలుసని, కానీ జై విజ్ఞాన్..జై అనుసంధాన్ నినాదాలను వాటికి ప్రధాని మోదీ చేర్చారని కేంద్ర వ్యవసాయం శాఖా మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అన్నారు.

ఇక్రిశాట్ స్వర్ణోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన సంకల్పంతో ఇక్రిశాట్ ముందుకు సాగాలన్నారు. కొత్త వంగడాల సృష్టితో మరింత ముందుకు సాగాలన్నారు.

మరో 25 ఏళ్లలో వ్యవసాయరంగంలో పెనుమార్పులు వస్తాయన్నారు.

గంజాయి రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని వేములవాడ డీఎస్పీ చంద్రకాంత్

-యువత సన్మార్గంలో నడవాలి, దూరలవాట్లకు దూరంగా ఉండాలి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి):గంజాయి రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని వేములవాడ డీఎస్పీచంద్రకాంత్ అన్నారువేములవాడ పట్టణ పరిధిలో గల అగ్రహారం పాలిటెక్నిక్ కాలేజీ లో విద్యార్థులకు గంజాయి గురించి దాని వల్ల కలిగే దుష్ఫలితాలా గురించి వేములవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్రకాంత్ యువత కు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు గంజాయి నిర్మూలనకు తొడ్పాడాలి అని ముఖ్యం గా యువత దురలవాట్లకు లోను కాకుండా సన్మార్గం లో నడవాలి అని మత్తు పదార్థాలకు అలవాటు పడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను అనవసరం గా ఇబ్బందుల పాలు చేసుకోవద్దని గంజాయి నిర్మూలనలో యువత కీలక పాత్ర వహించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తగా 200 జూనియర్ కాలేజీలు : ఆదిమూలపు సురేష్

అమరావతి, ఫిబ్రవరి 5:విద్యా ప్రమాణాల మెరుగుదలకు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి అమలు చేస్తుందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. దీనిలో భాగంగా ప్రతి మండలానికి ఒక కో-ఎడ్యుకేషన్ కళాశాల, బాలిక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కూడా ఆదేశాలు ఇచ్చారని మంత్రి తెలిపారు. వృత్తివిద్య కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 200 జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. బాలికల కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రైతులను ఆదుకునే పార్టీకి అండగా ఉండాలే.. ఉత్తరాఖండ్ ర్యాలీలో రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:చలికి వణుకుతూ.. ఎండలో చెమటలు కక్కుతూ ఏడాది పాటు కరోనా మహమ్మారికి కూడా భయపడకుంటా రోడ్లపై రైతులు ఆందోళన చేస్తుంటే ప్రధానమంత్రి మోడీ పట్టించుకోలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తాను ఈ దేశానికి రాజును అనుకుంటున్నాడని, తాను చెప్పిందే వేదం, చేసిందే చట్టం అన్నట్టుగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. అతనేం నిర్ణయం తీసుకున్నా ప్రజలు నిశ్శబ్దంగా ఉండాలని.. నోరు మెదపొద్దని.. మోడీ తీరు అట్లానే ఉందని విమర్శించారు. ఇవ్వాల "ఉత్తరాఖండ్ కిసాన్ స్వాభిమాన్ సంవాద్" ర్యాలీలో రైతులను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడారు. రైతులు, యువకులు, పేదల భాగస్వామ్యంతో పనిచేసే ప్రభుత్వాన్ని అందించాలని కాంగ్రెస్ భావిస్తోందని అన్నారు. "అందరి కోసం పని చేయకపోతే అతను ప్రధాని కాలేడు.. ఆ లెక్క ప్రకారం నరేంద్ర మోడీ అస్సలు ప్రధాని కానే కాదు" అని ర్యాలీ సందర్భంగా తీవ్ర విమర్శలు చేశారు రాహుల్.

కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులు రుణమాఫీ కోసం తమను సంప్రదించారని.. దాన్ని 10 రోజుల్లోనే చేసి చూపించాం అని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాన్ని ఉదాహరణగా చూపుతూ చెప్పారు రాహుల్ గాంధీ. రైతులకు రూ.70 వేల కోట్ల రుణమాఫీ చేసినట్టు గుర్తు చేశారు. ఇదేమీ ఉచిత బహుమతి కాదు. రైతులు దేశం కోసం 24 గంటలు పని చేస్తారు కాబట్టి రుణమాఫీ చేశాం అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ రైతులకు ఎప్పుడూ డోర్స్ తెరిచే ఉంచిందని, రైతులు, పేదలు, కార్మికుల భాగస్వామ్యంతో పని చేయాలని తాము కోరుకుంటున్నామన్నారు. తద్వారా ప్రతి వర్గం తమ ప్రభుత్వమని భావించాలని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ అన్నారు. మనకు ధనిక పారిశ్రామికవేత్తలు, ఫైవ్ స్టార్ హోటళ్లు, మెర్సిడెస్ కార్లు ఉన్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతున్నా మరోవైపు పేదలు, నిరుద్యోగుల భారతదేశం మరొకటి ఉంది. ఎంపిక చేసిన 100 మంది వ్యక్తుల వద్ద దేశ జనాభాలో 40 శాతం సంపద ఉంది. ఆదాయ వ్యత్యాసాలు మరెక్కడా కనిపించడం లేదని రాహుల్ మండిపడ్డారు.

"మాకు ఇట్లాంటి రెండు భారతదేశాలు వద్దు.. ఒకే భారతదేశం కావాలి. అన్యాయం అంతం కావాలి." అని సమాజంలోని అంతరాన్ని ప్రస్తావించారు. ఏడాది పాటు ఆందోళనలు చేసి బీజేపీ మెడలు వంచి మరీ మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయించినందుకు రైతులను రాహుల్ గాంధీ అభినందించారు. అన్యాయం జరుగుతున్నందునే రైతుల పోరాటానికి కాంగ్రెస్ అండగా నిలిచిందని చెప్పారు కాంగ్రెస్ పార్ట మాజీ చీఫ్ రాహుల్ గాంధీ.

అసెంబ్లీ ప్రత్యేక సమావేశం.. బిల్లును మరోసారి గవర్నర్‌కు పంపనున్న సర్కార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:నీట్ మినహాయింపు వ్యవహారం తమిళనాడు రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరలేపింది.ఈ విషయంలో సీఎం స్టాలిన్, గవర్నర్ రవి మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. నీట్ పరీక్ష నుంచి రాష్ట్రానికి మినహాయింపును ఇవ్వాలని అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ రవి తిప్పి పంపించారు. దీంతో వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 10 పార్టీలు హాజరయ్యాయి. డీఎంకే, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, పీఎంకే, వీసీకేతో పాటు పలు పార్టీలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ గవర్నర్ రవి తీరుపై అఖిలపక్షంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గవర్నర్ నీట్ బిల్లును 142 రోజుల పాటు తనవద్దే ఉంచుకొన్నారని, సరిగ్గా మెడికల్ అడ్మిషన్లు ప్రారంభమైన సమయంలోనే స్పీకర్‌కు పంపించారని స్టాలిన్ ఆరోపించారు. మరోవైపు అఖిలపక్ష సమావేశం నీట్ బిల్లుపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును తిరిగి గవర్నర్‌కు పంపాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. నీట్ బిల్లు విషయంపై ఫిబ్రవరి 8న అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరచాలని, అక్కడి నుంచే తిరిగి గవర్నర్‌కు ఈ బిల్లును తిరిగి పంపాలని అఖిలపక్షం నిర్ణయించుకుంది.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఘనంగా వసంత పంచమి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో శనివారం వసంత పంచమి పర్వదినం సందర్భంగా వేద పండితుల సమక్షంలోఅక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. 50 మంది చిన్నారులు చిన్నారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకటకృష్ణ మాట్లాడుతూ సరస్వతి మాత పూజను ఆచరించిన వారికి సకల శుభాలతో పాటు అష్టైశ్వర్యాలు కల్గుతాయని తద్వారా సుఖవంతమైన జీవితాన్ని పొందవచ్చని తెలిపారు విద్యార్థులందరు ఉ పాధ్యాయులు నిర్దేశించినటువంటి మార్గాలను అనుసరించి తల్లిదండ్రులను గౌరవించి తరగతి గదుల్లో నేర్చుకున్నటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేసి ఘనవిజయాలను సాధించాలని సూచించారు . వసంత పంచమి చాలా విశిష్టమైన రోజు అని , ఈ రోజున అమ్మవారిని ఆరాధించిన వారికి కోరిన ఫలాలను పొందుతారని తెలుపుతూ ప్రత్యేకంగా అమ్మవారి పుణ్యక్షేత్రాలైన క బాసరలో అత్యంత వైభవోపేతంగా వేడుకగా నిర్వహిస్తారని మరియు ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం ఒక ఆనవాయితీగా వస్తున్నదని తెలుపుతూ ప్రతి విద్యార్థి కూడా ఈ రోజున ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించే విధంగా కృషి చేసి సమాజంలో అగ్రగామిగా నిలవాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్ గీత దేవి , ఉ పాధ్యాయులు , తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు .

11న సీఎం ప్రారంభించనున్న కలెక్టరేట్.. ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 5:ఈ నెల 11వ తేదీన జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయాల సముదాయాన్ని, టీఆర్ఎస్ జనగామ జిల్లా కార్యాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా తేదీన ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో వీటిని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరిశీలించారు.

అదే రోజు సీఎం బహిరంగ సభ కూడా జరగనున్న నేపథ్యంలో సభాస్థలాన్ని కూడా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరిశీలించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఎర్రబెల్లి అనంతరం మీడియాతో మాట్లాడారు.ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జిల్లాలోని అన్ని కార్యాలయాల సముదాయంగా నిర్మించిన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారని, జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, ఆ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. వాటిని పరిశీలించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అవసరమైన సూచనలు చేశామన్నారు.

సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆయా ఏర్పాట్లలో ఉమ్మడి జిల్లా మంత్రులమైన తాను, సత్యవతి రాథోడ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మల్యేలు, జడ్పీచైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా కలిసి పాల్గొంటున్నామని మంత్రి వివరించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.